రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరి
	బుధవారం	గురువారం
కర్నూలు	6:35	4:55
నంద్యాల	6:31	4:55

చెత్త కేసీ చూడండి..!

డంప్ యార్డును తలపిస్తున్న కెనాల్





కర్నూలు న్యూసిటీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నగరం నడిబొడ్డున ప్రవహిస్తున్న కేసీ కెనాల్ డంప్ యార్డును తలపిస్తోంది. నగరంలోని చెత్తాచెదారమంతా కేసీ కెనాల్‌లో పడేస్తుండడంతో గుట్టలుగా పేరుకుపోయింది. ప్రస్తుతం కేసీ కెనాల్‌లో నీరు లేకపోవడంతో చెత్తా చెదారంతో నిండిన కేసీ కెనాల్ నుంచి సమీప నివాస ప్రజలకు దుర్వాసన వెదజల్లుతోంది. అయితే ఇదంతా కేసీ కెనాల్ పరివాహక ప్రాంతాల ప్రజలే అందులో వేస్తున్నారని నగర పాలక అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో కేసీ కెనాల్‌ను ప్రక్షాళన చేసి ప్రజలు రోగాలబారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత నగర పాలక, ఇరిగేషన్ అధికారులపై ఉంది.



కేసీ కెనాల్‌లో చెత్తా చెదారం





దిబ్బను తలపిస్తున్న వినాయక్ ఘాట్ వద్ద గల కేసీ కెనాల్, నీటిలో పడేసిన చెత్తాచెదారం

ఐదేళ్ల తర్వాత..

రైతుబజార్లకు నిధులు మంజూరు



సీ.క్యాంపు రైతుబజారులో శిథిలావస్థకు చేరిన డ్రైనేజీ

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రైతులకు, వినియోగదారులకు ఆర్థిక ప్రయోజనం అందించాలనే లక్ష్యంతో గతంలో తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రైతుబజార్లను ఏర్పాటు చేసింది. తాము పండించిన కూరగాయలను గిట్టుబాటు ధరకు అమ్ముకోవడంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన తక్కువ ధరకే కూరగాయలు అందించడం వల్ల కొద్దికాలంలోనే ఈ రైతుబజార్లకు ఆదరణ పెరిగింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఒక్క కర్నూలు నగరంలోనే సీ క్యాంపు రైతుబజారు, కొత్తపేట, అమీన్ అబ్బాస్ నగర్‌లో మూడు రైతుబజార్లను ఏర్పాటు చేశారు. ఆదోని, నంద్యాలలో మరో రెండు రైతుబజార్లు ఏర్పాటయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వంలో కక్షతో ఈ రైతుబజార్లకు ఐదేళ్ల కాలంలో ఒక్క రూపాయి కూడా వసతుల ఏర్పాటుకు విడుదల చేయలేదు. దీంతో రైతులు, ప్రజలు రైతుబజార్లలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మళ్లీ కూటమి ప్రభుత్వం రావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ రైతుబజార్ల అభివృద్ధిపై దృష్టి పెట్టారు. కర్నూలు జిల్లాలో సీక్యాంపు రైతుబజారుకు రూ.7.50 లక్షలు, అమీన్ అబ్బాస్ నగర్‌లోని రైతుబజారుకు రూ.2.70 లక్షలు, కొత్తపేట రైతుబజారుకు రూ.3.40 లక్షలు, ఆదోనికి రూ.12 లక్షలు, కల్లూరులోని గోవర్ధనగిరి రైతుబజారుకు రూ.3.50 లక్షలు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి తెలిపారు. టెండర్లు త్వరలోనే పూర్తి చేసి ఆయా రైతుబజార్లలో మౌలిక వసతులను కల్పిస్తామని, ఇక రైతులకు వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని ఆయన తెలిపారు.

అక్రమ లేఅవుట్లపై కొరడా

- తక్షణమే క్రమబద్ధీకరించుకోవాలి
- కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్ మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో అనుమతులకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన వెంచర్లు, నిర్మాణాలపై శాఖపరమైన చర్యలు తప్పవని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వరు అన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. కర్నూలు, నంద్యాల పార్లమెంటు పరిధిలో ఇప్పటికే క్షేత్రస్థాయి పర్యటన చేసి భారీ స్థాయిలో అక్రమ లేఅవుట్లు, నిర్మాణాలను గుర్తించామని, ఇందులో దాదాపు 220 మందికి క్రమబద్ధీకరించుకోవాలని నోటీసులు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమ లేఅవుట్లు, భవంతులు పుట్టగొడుగుల్లా వెలిశాయని, వారి స్వార్థ ప్రయోజనాలకు అమాయక ప్రజలు నష్టపోవటంతోపాటు, ప్రభుత్వ ఆదాయానికి భారీ గండిపడిందని అన్నారు. ఈ అక్రమాలను వెలుగులోకి తీసుకవచ్చేందుకు కార్యాలయ సిబ్బంది కసరత్తు చేస్తున్నారని చెప్పారు. మంత్రాలయంలో అత్యధికంగా 75 వరకు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టారని, ఇంటి నిర్మాణానికి అనుమతులు తీసుకొని, భారీ అంతస్తులు నిర్మించి వాటిని లాడ్జిలుగా వినియోగిస్తూ వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని, దీని వల్ల ప్రభుత్వానికి అధికారికంగా రావాల్సిన రుసుం, ఆదాయం రావటం లేదని సోమిశెట్టి పేర్కొన్నారు. వీరంతా వెంటనే కుడా కార్యాలయంలో సంప్రందించి నిర్మాణాలకు అనుగుణంగా అనుమతులు తీసుకొని, అందుకు తగ్గ రుసుం చెల్లించాలని సూచించారు. లేనిపక్షంలో సంబంధింత నిర్మాణాల విద్యుత్, నీటి కనెక్షన్‌లను తొలగించేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అమ్మకందారులు అక్రమ వెంచర్లను ఏర్పాటు చేసి అమాయక ప్రజలకు అంటగడుతున్నారని, వీటిపై ప్రజలను చైతన్యుల్ని చేసేందుకు ప్రధాన రహదారులు, కూడళ్లు, ముఖ్య కార్యాలయాల వద్ద కరపత్రాల పంపిణీ, ఫ్లెక్సీల ఏర్పాటు, మైక్‌లో ప్రకటనల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. కొనుగోలుదారులు సైతం అనుమతులు లేని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్థలాలు, నిర్మాణాలను కొనుగోలు చేయవద్దని, దీని వల్ల వారికి ప్రభుత్వపరంగా ఎటువంటి సౌకర్యాలు, ప్రయోజనాలు అందవని స్పష్టం చేశారు. పంచాయతీ కార్యదర్శులు సైతం తమ పరిధిలోని అక్రమ వెంచర్లు, నిర్మాణాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బాధ్యులైన వారికి నోటీసులు అందజేసి, ప్రభుత్వ రాబడిని పెంచాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే పంచాయతీ కార్యదర్శులపై శాఖపరమైన చర్యలకు సిఫారసుల చేస్తామని సోమిశెట్టి హెచ్చరించారు. ప్రభుత్వానికి రుసుంల రూపంలో వచ్చే రాబడి వల్ల అభివృద్ధి మరింత పుంజుకుంటుందని ఆయన పేర్కొన్నారు.

గ్రేడ్-2 వీఆర్వోలకు పదోన్నతులు

కర్నూలు కలెక్టరేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అర్హత కలిగిన గ్రేడ్-2 వీఆర్వోలు గ్రేడ్-1 వీఆర్వోలుగా పదోన్నతులు పొందనున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని 161 మంది గ్రేడ్-2 వీఆర్వోల రోస్టర్ పాయింట్లు సీనియారిటీ లిస్టు మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారులు ప్రకటించారు. రోస్టర్ పాయింట్లు సీనియారిటీ లిస్టు అభ్యంతరాలపై ఏడు రోజులలోపు తెలియజేయాలని సూచించారు. ప్రమోషన్ల కోసం నగరానికి చెందిన ఒక సచివాయలం వీఆర్వో తన సహచరులతో డబ్బులు వసూలు చేసినా ఎలాంటి క్రమశిక్షణా చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఒక్కో వీఆర్వో నుంచి రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఇటు రెవెన్యూ అధికారులు కానీ, అటు ఉన్నతాధికారులు నోరు మెదకపోవడం గమనార్హం.

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళిక

- కలెక్టర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- సదస్సుకు హాజరైన మంత్రి టీజీ భరత్, కలెక్టర్, ఎస్పీ

కర్నూలు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. గ్రామాలు, పట్టణాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు కలెక్టర్లు, అధికారులకు సూచించారు. మంగళవారం అమరావతిలోని సచివాలయంలో కలెక్టర్ల సదస్సు జరిగింది. జిల్లా మంత్రి టీజీ భరత్, కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌లు ఈ సదస్సుకు హాజరయ్యారు. జిల్లా ప్రగతి అజెండా లక్ష్యంగా వివిధ శాఖల పురోగతి నివేదికలతో వెళ్లారు. వేసవి తాగునీటి సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, ఎక్కడా సమస్య రాకుండా అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. అదే క్రమంలో జిల్లాలో నీటి ఎద్దడి తలెత్తకుండా కర్నూలు నగరం, ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు మున్సిపల్ పట్టణాలతోపాటు 484 పంచాయతీలు, 237 మజరా గ్రామాల్లో చేపట్టిన చర్యలు, 33 సమగ్ర రక్షిత మంచినీటి పథకాలు (సీపీడబ్ల్యూఎస్) ఎస్ఎస్ ట్యాంకులు, గాజులదిన్నె, సుంకేసుల, పులికనుమ, పత్తికొండ జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు వివరాలను కలెక్టరు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. జిల్లాలో పీ4 అమలుపై తీసుకుంటున్న చర్యల నివేదికను కలెక్టర్ తీసుకెళ్లారు. నేడు జిల్లాల వారిగా ప్రగతి, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు తీరుపై సీఎం చంద్రబాబు సమీక్షించనున్నారు.



సదస్సులో పాల్గొన్న మంత్రి టీజీ భరత్, కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్

అభివృద్ధికి దారి లేదా..?

- జిల్లాలో విస్తరణకు నోచుకోని జాతీయ రహదారులు
- గుత్తి-మాన్వి వయా పత్తికొండ జాతీయ రహదారిగా అప్‌గ్రేడేషన్ కోసం కేంద్రానికి ప్రతిపాదన
- కర్నూలు-బళ్లారి వయా కోడుమూరు, ఆలూరు..
- కాల్వబుగ్గ-ఎమ్మిగనూరు వయా వెల్దుర్తి, కోడుమూరు రోడ్లు కూడా..
- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం
- ఈ ప్రభుత్వంలోనైనా మోక్షం లభించేనా..?



గుత్తి-ఆదోని వయా పత్తికొండ ప్రధాన రహదారి

కర్నూలు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రహదారులు ప్రగతికి చిహ్నాలు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి అనుసంధానిస్తే రాకపోకలు మెరుగుపడుతాయి. తద్వారా వ్యాపారం, ఇతర రంగాల్లో పురోగతి సాధించవచ్చు. అందులో జాతీయ రహదారులు అత్యంత ప్రధానం. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో కొలువుదీరిన ఎన్డీఏ ప్రభుత్వం జాతీయ రహదారుల విస్తరణకు నడుంబిగించింది. రాష్ట్ర ప్రధాన రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడేషన్ కోసం ప్రతిపాదనలు స్వీకరించింది. నిత్యం కరువుతో తల్లడిల్లే పశ్చిమ ప్రాంతం అభివృద్ధిలో కీలకమైన గుత్తి-మాన్వి వయా పత్తికొండ, ఆదోని రోడ్డును నేషనల్ హైవేగా అప్‌గ్రేడేషన్ కోసం 2017లోనే సర్వే చేసి కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు పంపారు. అత్యంత కీలకమైన కర్నూలు-బళ్లారి వయా కోడుమూరు, ఆలూరు రోడ్డు.. ఓర్వకల్లులోని కాల్వబుగ్గ-ఎమ్మిగనూరు వయా వెల్దుర్తి, కోడుమూరు, గోనెగండ్ల రోడ్లను నేషనల్ హైవేగా విస్తరించాలని రెండేళ్ల క్రితమే ప్రతిపాదనలు పంపారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా మారింది. సీఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం రావడం, కేంద్రంలో ప్రధాని మోదీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వంతో సఖ్యతగా ఉండడంతో జాతీయ రహదారుల విస్తరణపై ఆశలు చిగురిస్తున్నాయి. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు సహా ఎమ్మెల్యేలు దృష్టి సారించాలి.



కర్నూలు-బళ్లారి వయా కోడుమూరు ప్రధాన రోడ్డు

ఎనిమిదేళ్ల స్వప్నం

గుత్తి-మాన్వి వయా పత్తికొండ, ఆదోని ప్రధాన రోడ్డును జాతీయ రహదారి విస్తరణ ఎనిమిదేళ్ల స్వప్నం. రాష్ట్ర విభజన తరువాత ఆంధ్ర-కర్ణాటక రాష్ట్రాలను అనుసంధానం చేస్తూ ఈ రోడ్డు విస్తరణకు సర్వే చేయించారు. ఉత్తర కర్ణాటకలోని రాయచూరు, సింధనూరు, మాన్వి, గంగావతి వంటి ప్రాంతాల ప్రజలు రాజధాని బెంగళూరుకు వెళ్లేందుకు దూరం తగ్గుతుంది. అలాగే జిల్లాలో ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆలూరు ప్రాంతవాసులు అనంతపురం, బెంగళూరు వెళ్లాలంటే ఈ మార్గమే ఆధారం. బెంగళూరులో జిల్లాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు వేలాది మంది పని చేస్తున్నారు. కీలకమైన గుత్తి-మాన్వి వయా పత్తికొండ, ఆదోని రోడ్డును నేషనల్ హైవేగా విస్తరించాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది.
హైదరాబాద్-బెంగళూరు వయా కర్నూలు, అనంతపురం జాతీయ రహదారిని గుత్తి వద్ద కలుపుతూ గుత్తి, పత్తికొండ, ఆదోని, మదిరె, హానవాల్, కుంటనహాల్, ఉప్పరహాల్, కౌతాళం, ఉరుకుంద, హాల్వి, కుంబళనూరు మీదుగా కర్ణాటక రాష్ట్రంలోని మాన్వి వరకు జాతీయ రహదారిగా విస్తరించాలని ప్రతిపాదించారు. సర్వే కోసం 2017 జూన్‌లో టెండర్లు పిలిచారు. ఆ వెంటనే సర్వే పూర్తి చేసి తుంగభద్ర నదిపై వంతెన నిర్మాణంతోపాటు ఏపీ ప్రాంతంలో కల్వర్టు నిర్మించాలి, సింగిల్ రోడ్డు ఎన్ని కిలోమీటర్లు, డబుల్ రోడ్డు ఎన్ని కిలోమీటర్లు అనేది తేలాచ్చారు. ప్రాథమికంగా 135 కిలోమీటర్ల రోడ్డును జాతీయ రహదారిగా అప్‌గ్రేడేషన్ చేయాలని కేంద్ర రోడ్లు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు పంపారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో నిర్లక్ష్యం కారణంగా ఆ ప్రతిపాదన అటకెక్కింది.

మిగతా 6వ పేజీలో

నాన్న రోడ్డున పడ్డాడు..

- రోడ్డు డివైడర్‌పై అనాథ వృద్ధుడు
- ఎండ వేడిమికి విలవిల

కర్నూలు హాస్పిటల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నాన్న ఎందుకో రోడ్డున పడ్డాడు.. భార్యా పిల్లలకు కోసం అహో రాత్రులు శ్రమించినా ఎందుకో నిరాదరణకు గురయ్యాడు.. జీవిత చరమాంకంలో అండగా ఉండాల్సిన వారి ప్రేమను ఎందుకో పొందలేకపోయాడు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఎదుట రోడ్డు డివైడర్‌పై 70 ఏళ్ల ఓ వృద్ధుడు అనాథగా పడి ఉన్న దృశ్యం అందర్నీ కలిచి వేసింది. ఆయన రెండు కాళ్లకు కట్లు కట్టి అచేతనావస్థలో పడి ఉన్నాడు. ఆయనను మాట్లాడించే ప్రయత్నం చేయగా తన పేరు సత్యనాగరాజు అని, తమది విజయవాడ అని ఆత్మకూరు వద్ద రోడ్డు ప్రమాదంలో దెబ్బలు తగిలాయని చెబుతున్నారు. ఇక్కడ ఎవరు వదిలి వెళ్లారని ప్రశ్నిస్తే కన్నీళ్లు పెట్టుకుంటున్నాడు తప్పా సమాధానం ఇవ్వడం లేదు. ఉదయమే వృద్ధుడిని వదిలేసి వెళ్లినట్లు కాళ్లకు కట్టిన కట్ల ద్వారా తెలుస్తోంది. ఎండవేడిమికి తట్టుకోలేకపోతున్న వృద్ధుని చూసి ఆసుపత్రికి వచ్చిన రోగుల బంధువులు అల్పాహారం పెట్టి మంచినీరు అందించారు. సత్య నాగరాజు పేరుతో కర్నూలు జీజీహెచ్ క్యాజువాల్టీకి వచ్చి చికిత్స చేయించుకున్నట్లు వివరాలు లేవని ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్‌వోడీ డా.రామశివనాయక్ చెబుతున్నారు. ఈ ఘటనపై కర్నూలు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు స్పందించారు. 108 వాహనం ద్వారా రోగిని క్యాజువాల్టీలో చేర్పించి వైద్యం అందించేందుకు చర్యలు తీసుకున్నారు. ఆయనకు సహాయకులుగా ఓ శానిటేషన్ సిబ్బందిని అందుబాటులో ఉంచారు.



భ్రామరికి పుట్టింటి సారె..!


కావడిలను మోస్తూ శ్రీశైలానికి కాలినడకన వెళ్తున్న కన్నడ భక్తులు

- ఆడపడుచు వాయన సమర్పణకు కన్నడిగుల పాదయాత్ర
- శతాబ్దాలుగా కొనసాగుతున్న ఆచారం
- మండుటెండలను లెక్కచేయని భక్తిపారవశ్యం
- వందల కి.మీ. దూరం నుంచి రోజుల తరబడి ప్రయాణం

ఆత్మకూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): తమ ఇంటి ఆడపడుచుకు పుట్టించి సారెను సమర్పించేందుకు కన్నడిగులు వందలాది కిమీల నుంచి పాదయాత్రగా తరలివస్తున్నారు. మండుటెండలను సైతం లెక్కచేయకుండా మల్లన్న సన్నిధికి చేరుకుంటున్నారు. శ్రీశైలంలో ప్రతిఏటా జరిగే ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని పాల్గుణ మాసంలో కన్నడిగులు శ్రీశైలానికి పాదయాత్రగా తరలివస్తారు. ప్రత్యేకించి శ్రీశైలేషుని ధర్మపత్ని భ్రమరాంబిక అమ్మవారిని కన్నడిగులు సాక్ష్యాత్తు తమ ఆడపడుచుగా భావించి పుట్టింటి సారెను (పసుపు, కుంకుమ, గాజులు, వస్త్రాలు, వడిబియ్యం) సమర్పించేందుకు శతాబ్దాల కాలం నుంచి కాలినడకన అమ్మవారి సన్నిధిగా చేరుకుంటారు. ఉగాది పర్వదినాన్ని ముందే కన్నడిగులు శ్రీశైలానికి చేరుకొని అమ్మవారికి పుట్టింటిసారే సమర్పించి తమ భక్తిపారవశ్యాన్ని చాటుకుంటారు. అలాగే భ్రామరీ అమ్మవారికి మిరియాల చూర్ణాన్ని (మిరియాలపట్టు) కూడా నుదుటన ఉంచేందుకు తీసుకొస్తారు. ఎందుకంటే శ్రీశైలంలో జరిగిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో క్షేత్రానికి లక్షలాదిగా భక్తులు తరలివస్తారు. ఆ సమయంలో భక్తుల రద్దీతో అమ్మవారికి తలపోటు వచ్చిందేమోనన్న భావనతో తమ ఆడపడుచుకు ఆ కష్టాన్ని తొలగించాలన్న ఉద్దేశంతో మిరియాల పట్టును తీసుకురావడం సంప్రదాయంగా వస్తోంది. ఎంతో విశేష ప్రాశస్త్యం కలిగిన కన్నడిగుల పాదయాత్ర శ్రీశైల క్షేత్ర ఆవిర్భావం నుంచే కొనసాగుతున్నట్లు పురాణాలు చెబుతున్నాయి.


నల్లమల అటవీ మార్గం మీదుగా కాలినడకన వెళ్తున్న కన్నడ భక్తులు


వందల మైళ్ల నుంచి పాదయాత్ర

కర్ణాటక రాష్ట్రంలోని బైచ్‌వాల్, కన్నల్లి, కూడలి, కెంపాలి, సోలాపూర్, బాగల్‌కోట, అత్తిని, బళ్లారి, గుల్బర్గ, ఉగ్లీ, సింధిని, కచునూర్, అరికెరి, రాయచూర్, వంటి సుదూర ప్రాంతాల నుంచి వందలాది కిలోమీటర్లు కాలినడకన పాదయాత్ర చేస్తు వస్తుంటారు. ఇందుకోసం దాదాపు పక్షం నుంచి నెల రోజుల ముందు తమ సొంత ప్రాంతాల నుంచి పాదయాత్రను ప్రారంభిస్తారు. కొంతమంది మొక్కుబడిగా కాళ్లకు కర్రలు ధరించి పాదయాత్ర సాగిస్తుంటారు. అటవీమార్గం వరకు కర్రలపైనే నడిచి తమభక్తిని చాటుకుంటారు. కొందరైతే అమ్మవారికి సమర్పించే సారేతో కూడిన కావడిలను మోస్తూ పాదయాత్రగా వెళ్తుంటారు.

పాదయాత్ర సాగేదిలా..!

సుదూర ప్రాంతాల నుంచి కాలినడన ఆత్మకూరుకు వచ్చే కన్నడిగులు అక్కడి నుంచి పాదయాత్ర ద్వారానే వెంకటాపురం గ్రామానికి చేరుకుంటారు. అక్కడ వీలైతే కాసింత సమయం సేదతీరి పంట పొలాల మార్గం గుండా అటవీమార్గంలో ప్రవేశించి బైర్లూటి వీరాంజనేయ స్వామి ఆలయాన్ని దర్శిస్తారు. ఆ తర్వాత వారు బైర్లూటి మీదుగా నాగలూటి వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం నాగలూటి తిప్పలుపై నడుస్తూ దాదాపు 16 కిమీల దూరంలో ఉన్న పెచ్చెర్వు చెంచుగిరిజన గూడేనికి చేరుకుంటారు. ఈ ప్రాంతాల చాలా వరకు భక్తులు కొంత సమయం పాటు సేదతీరుతారు. అక్కడి నుంచి తిప్పలు, అటవీ మార్గం గుండా సుమారు 18 కిమీలు నడిచి భీమునికొలను ప్రాంతానికి చేరుతారు. అక్కడి నుంచి మరో 5 కిమీల దూరంలో హటకేశ్వరం, ఆ తర్వాత 6 కిమీల దూరంలో శ్రీశైల మహాక్షేత్రానికి చేరుకుంటారు. మార్గమధ్యంలో పెద్దచెరువు, భీముని కొలను ప్రాంతాల మధ్యలో వెలసిన కోర్కెల కొండలో కన్నడిగులు కోర్కెలు నెరవేరాలంటూ వృక్షాలకు కాశాయరంగు వస్త్రంతో ఊయలకట్టి అందులో ఏదైనా వస్తువును ఉంచి నమస్కరిస్తారు. అలాగే మరికొందరు సొంత నిర్మాణ స్వప్నాన్ని నిజం చేసుకునేందుకు అక్కడ వున్న కొండరాళ్లను ఒకదానిపై ఒకటి అమర్చుతారు. అంతేకాకుండా మరికొందరు సంతాన ప్రాప్తికై తమ మొక్కుబడులను ఈ కొండపైనే తీర్చుకుంటుంటారు.


కోర్కెల కొండపై సంతానం కోసం ఊయల కడుతున్న భక్తులు


కోర్కెల కొండపై కన్నడిగులు అమర్చిన రాళ్ల నిర్మాణాలు



25 సార్లు శ్రీశైలానికి కాలినడకన వచ్చా

మాది కర్ణాటక రాష్ట్రంలోని సోలాపూర్ ప్రాంతం. ఉగాది ఉత్సవాలను పురస్కరించుకుని 25ఏళ్లుగా ప్రతిఏటా శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనార్థం కాలినడకన వస్తున్నాను. పదిరోజులుగా 600 కిమీలు ప్రయాణించి ఇక్కడికి చేరుకున్నాను. శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లపై తమకు వున్న భక్తిభావమే మమ్మల్ని శ్రీశైలానికి చేరవేస్తోంది. మల్లన్నే మాకు ఏకష్టం రానివ్వకుండా తమ యాత్రను పూర్తిచేస్తాడని మా నమ్మకం.

\- చిదాంబరాయ్, సోలాపూర్, కర్ణాటక రాష్ట్రం



మల్లన్నపై అపారమైన నమ్మకం

శ్రీశైల మల్లన్నపై అపారమైన నమ్మకం, భక్తితోనే వందల కిలోమీటర్ల నుంచి పాదయాత్ర చేస్తున్నాం. ఉగాది ఉత్సవాలను పురస్కరించుకుని ఇప్పటి వరకు 15 సార్లు శ్రీశైలానికి కాలినడకన వచ్చాను. మల్లన్న దయతో తనకు శక్తి ఉన్నంతవరకు శ్రీశైలానికి రావాలని భావిస్తున్నాను. ఇలా పాదయాత్రగా వెళ్లడం వల్ల మంచి జరుగుతోంది. ఎంతో మంది భ్రమరాంబ అమ్మవారికి వాయనం సమర్పించేందుకు శ్రీశైలానికి కాలినడకన వస్తున్నారు.

\- గౌరీబాయి, సోలాపూర్, కర్ణాటక రాష్ట్రం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నిప్పుతో జాగ్రత్త

- అప్రమత్తతోనే అగ్ని ప్రమాదాల నివారణ
- 24 గంటలు అందుబాటులో ఉంటాం
- మంత్రాలయం, ఓర్వకల్లులో ఫైర్ స్టేషన్లకు ప్రతిపాదనలు
- డీఎఫ్‌వో అవినాశ్ జయసింహ



కర్నూలు క్రైం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎండలు మండుతున్నాయి. వేసవి ప్రారంభంలోనే ఉష్ణోగ్రత 40 డిగ్రీలకు చేరుకుంది. ఇంత ఎండల్లో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే ఆస్తినష్టం, ప్రాణనష్టం తప్పదు. ఈ సందర్భంగా జిల్లాలో అగ్ని ప్రమాదాల నివారణకు అగ్నిమాపక శాఖ అధికారులు తీసుకుంటున్న చర్యలు, ప్రణాళికలు తదితర అంశాలపై జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి (డీఎఫ్‌వో) అవినాశ్ జయసింహ చెప్పిన కొన్ని అంశాలు.



- **ప్రశ్న:** జిల్లా వ్యాప్తంగా ఎన్ని అగ్నిమాపక కేంద్రాలు.. ఫైరింజన్లు, సిబ్బంది ఉన్నారు...?
- **డీఎఫ్‌వో:** జిల్లా వ్యాప్తంగా కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ, ఆలూరులో ఆరు ఆరు ఫైర్ స్టేషన్లు ఉన్నాయి. కర్నూలులో రెండు ఫైరింజన్లతో పాటు ఒక రెస్క్యూటీం వాహనం, ఆదోనిలో రెండు ఫైరింజన్లు, కోడుమూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ ఆలూరులో ఒక్కొక్కటి చొప్పున ఫైరింజన్లు ఉన్నాయి. వీటితో పాటు మిస్టి వాహనాలు కూడా ఉన్నాయి.
- **ప్రశ్న:** ప్రమాదాలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నారా..?
- **డీఎఫ్‌వో:** వేసవిలో ఎక్కువగా పంట పొలాల్లో, గడ్డివాములకు నిప్పంటుకుంటాయి. ఫైర్ స్టేషన్‌కు కాల్ వచ్చిన వెంటనే సిబ్బంది ఘటనా స్థలానికి బయలుదేరి వెళ్తారు. ఘటనా స్థలానికి చేరుకోవడానికి అటు ఇటూ ఆలస్యమైనా కూడా ప్రమాదాలు నివారించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం.
- **ప్రశ్న:** సిబ్బంది కొరత ఏమైనా ఉందా..?
- **డీఎఫ్‌వో:** జిల్లా వ్యాప్తంగా 6 ఫైర్ స్టేషన్‌లలో 34 మంది ఫైర్‌మెన్లు, ఆరుగురు డ్రైవర్ ఆపరేటర్ల కొరత ఉంది. కర్నూలులో 21 ఫైర్‌మెన్ల పోస్టులు ఉండగా.. 16 మందే ఉన్నారు. 7 డ్రైవర్ ఆపరేటర్ల పోస్టులు ఉండగా.. ఆరుగురే ఉన్నారు. ఆదోనిలో 19 మంది ఫైర్‌మెన్ల పోస్టులు ఉండగా.. 9 మంది, ఎమ్మిగనూరులో 9 మందికిగాను నలుగురు విధుల్లో ఉన్నారు. అలాగే కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండలలో 9మంది ఫైర్‌మెన్ల పోస్టులు ఉండగా.. నలుగురు, ముగ్గురు చొప్పున ఉన్నారు. మంత్రాలయం ఫైర్ స్టేషన్ కోసం ప్రతిపాదనలు పంపాం. ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు దగ్గర ఒక ఫైర్ స్టేషన్‌కు ప్రతిపాదనలు పంపాం. ఆదోనిలో ఒక మిస్టి వాహనం కావాలి.
- **ప్రశ్న:** అగ్ని ప్రమాదాల గుర్తింపు ఎలా?
- **డీఎఫ్‌వో:** విద్యుత్ లైన్ల కింద గడ్డివాములు ఉంటే వేసవిలో వచ్చే గాలులకు తీగలు ఒకదానికొకటి తగిలి నిప్పురవ్వలు చెలరేగి గడ్డివాముల మీద పడే అవకాశం ఉంది. గడ్డివాములకు దగ్గరలో గాజుముక్కలు, గాజు సీసాలు ఉంటే ఎండాకాలంలో వాటి మీద సూర్యకిరణాలు పడి నిప్పు అంటుకుంటుంది. కేర్‌లెస్ స్మోకింగ్ వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయి. రాత్రి వేళలో గ్యాస్ సిలిండర్లు ఆఫ్ చేయాలి. ఏసీ, ఫ్రీజర్ షాట్ సర్క్యూట్ వల్ల ప్రమాదాలు జరుగుతాయి.
- **ప్రశ్న:** తనిఖీలపై విమర్శలు వస్తున్నాయి?
- **డీఎఫ్‌వో:** నిరంతరం తనిఖీలు చేస్తూనే ఉన్నాము. గతంలో ప్రతి ఏడాది ఎన్‌వోసీ తీసుకోవాల్సి ఉండేది. ప్రస్తుతం మూడేళ్లకు ఒకసారి తీసుకునే వెసలుబాటు కల్పించారు. దీంతో పాటు ఎన్‌వోసీ జారీ చేసే అధికారి డీజీపీకే ఉంటుంది. మంటలు చెలరేగితే.. ఇసుక, పచ్చని కొమ్మలతో మంటలను ఆర్పేయాలి. ఇళ్లలో గ్యాస్ లీకైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నాం. గ్యాస్ లీకైతే కిటికీలు, తలుపులు తెరవాలి.

ప్రమాదాలు సంప్రదించండిలా..: ప్రమాదాలు జరిగితే 101కు కాల్ చేయాలి. అలాగే జిల్లా వ్యాప్తంగా ఆరు ఫైర్ స్టేషన్ల ఫోన్ నెంబర్లు ఉన్నాయి. వారికి కూడా కాల్ చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

ఫైర్ స్టేషన్	ఫోన్ నెంబర్లు	ల్యాండ్ నెంబర్లు
కర్నూలు	9963737924	08518-255101
ఆదోని	9963738169	08512-252299
ఎమ్మిగనూరు	9963738627	08512-255101
కోడుమూరు	9963739051	08525-228188
ఆలూరు	9963739178	08523-229088
పత్తికొండ	9963739458	08520-226700

30న టీజీవీ కళా క్షేత్రంలో ఉగాది సంబరాలు

అవార్డులకు పలువురి ఎంపిక

కర్నూలు కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకను పురస్కరించుకుని ఈ నెల 30న సాయంత్రం 5:30 గంటలకు ఉగాది సంబరాలు నిర్వహిస్తున్నట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్ష, కార్యదర్శులు పత్తి ఓబులయ్య, మహ్మద్ మియా మంగళవారం తెలిపారు. టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సాయంత్రం 5:30 గంటలకు కృష్ణ బృందంచే నాదస్వర కచేరీతో సంబరాలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం భాను స్వామిచే నూతన తెలుగు సంవత్సర పంచాంగ శ్రవణం, కరీముల్లా బృందంచే సంగీతం, నృత్య ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ప్రముఖ కవి ఇనాయతుల్లా బృందంచే ఉగాది కవి సమ్మేళనం, అనంతరం వివిధ రంగాల్లో నిష్ణాతులైన తొమ్మిదిమంది ప్రముఖులకు ఉగాది పురస్కారాలు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. విద్యారంగంలో జి.పుల్లయ్య, పద్య నాటకంలో పి.దస్తగిరి, సంగీతంలో గీతాంజలి, సాహిత్యంలో జంధ్యాల రఘుబాబు, నృత్యంలో పి.మీనాసాయి, జర్నలిజంలో మండిరాజు శ్రీనివాసరాజు, హరికథలో మంజుల, చిత్రలేఖనంలో దాసరి వెంకటరమణ, వాస్తులో ఎం.వినీలాను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేశ్‌తో పాటు అధికారులు హాజరవుతున్నట్లు తెలిపారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ


పోలీసు అధికారులు, సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ

శ్రీశైలం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా సూచించారు. శ్రీశైలంలో ఉగాది మహోత్సవాల సందర్భంగా బందోబస్తుకు వచ్చిన పోలీసు అధికారులకు, సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు వారికి కేటాయించిన ప్రాంతంలోనే విధులు నిర్వహించాలని, భక్తుల పట్ల మర్యాదగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, ఆత్మకూరు డీఎస్పీ రామంజినాయక్ పాల్గొన్నారు.

నేడు న్యాయవాదుల విధుల బహిష్కరణ

కర్నూలు లీగల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయవాదిపై కర్నూలు తాలుకా పోలీసులు నమోదు చేసిన కేసుకు వ్యతిరేకంగా బుధవారం న్యాయవాదులు తమ కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.కృష్ణమూర్తి, బీఎస్ రవికాంత్ ప్రసాద్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు జిల్లాకు చెందిన హైకోర్టు న్యాయవాది వి.మహేంద్రనాథ్ రెడి తన బంధువుల తరపున కర్నూలు తాలుకా పోలీసుల వైఖరికి వ్యతిరేకంగా ప్రశ్నించాడని, దానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ఈ అక్రమ కేసును నిరసిస్తూ తాము కోర్టు విధులను బుధవారం బహిష్కరిస్తున్నట్లు వారు తెలిపారు. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయవాది ఇజ్రాయెల్ హత్యను కూడా తాము ఖండిస్తున్నామని, నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

జల సంరక్షణకు ఉపాధి నిధులు

ఉమ్మడి జిల్లాలో 11 వేల నీటి కుంటల ఏర్పాటుకు చర్యలు

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వర్షపాతం తక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో సాగునీటికి ఇబ్బందులు తప్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా నంద్యాల, కర్నూలు జిల్లాలో 11వేల నీటి కుంటలు తవ్వేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా నిధులను సమకూర్చుతూ చర్యలు తీసుకుంది. కర్నూలు జిల్లాలో 8,500, నంద్యాల జిల్లాలో 2,500 నీటి కుంటలను వచ్చే మూడు నెలల్లోగా పూర్తి చేయాలని నీటి యాజమాన్య సంస్థ యంత్రాంగానికి ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. ఒక్కో నీటి కుంట నిర్మాణానికి రూ.40 వేల దాకా ఖర్చు అవుతుందని, రెండు జిల్లాలో 11వేల నీటి కుంటల నిర్మాణానికి కూలీలు, కూలీతో పాటు మెటీరియల్ కలిపి రూ.45 కోట్లు ఖర్చు చేయనున్నట్లు కర్నూలు, నంద్యాల జిల్లాల డ్వామా పీడీలు వెంకటసుబ్బయ్య, వెంకటరమణయ్యలు తెలిపారు.



- నీటి కుంటల విస్తీర్ణం మూడు రకాలుగా ఉండేలా రూపొందించారు. 8/8 సైజుతో పాటు 10/10, 20/20 సైజుతో నీటి కుంటలను గ్రామ పంచాయతీలు, పొలాల్లో ఏర్పాటు చేస్తారు.
- నీటి కుంటల ద్వారా వాన నీరు వృథా కాదు. పొలంలో నీటి కుంట తవ్వుకుంటే స్థలం వృథా అవుతున్నట్లు చాలా మంది రైతులు భావిస్తున్నారు. కానీ ఇది వాస్తవం కాదు. ఒకే రకం భూమిలో సుమారు 3 సెంట్ల నీటి కుంట తవ్వుకుంటే ఆ నీటి నిల్వతో మిగిలిన 97 సెంట్ల భూమిలో పంటలు సాగు చేయవచ్చు. కొద్దిపాటి వర్షం పడినా నీరు కుంటలో నిల్వ ఉంటుంది.
- నీటి కుంట చుట్టూ రెండేసి వరసల్లో ఘట్లను నిర్మిస్తారు. ఇందులో ఒక వరుసలో కూరగాయల సాగు, రెండో వరుసలో పండ్ల మొక్కల పెంపకం చేపట్టేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు.
- నీటి కుంటలో ఇన్‌లెట్, ఔట్‌లెట్ ఉండేలా విధిగా నీటిని వినియోగించుకునేలా చర్యలు చేపట్టారు. వేసవి కాలంలో ఈ నీటి కుంటలు అందించే ప్రయోజనం ఎంతో ఎక్కువగా ఉంటుంది. రాబోయే మూడు నెలల్లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు నీటి కుంటల నిర్మాణాన్ని పూర్తి చేసి రైతులకు ప్రయోజనం కల్పించేదిశగా అధికారులు చర్యలు ముమ్మరం చేశారు.

అభివృద్ధికి దారి లేదా..?

(5వ పేజీ తరువాయి)

కూటమి ప్రభుత్వం రావడంపై గుంతకల్లు, పత్తికొండ, ఆదోని ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, కేఈ శ్యాంబాబు, డాక్టర్ పీవీ పార్థసారథి, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డిలు ఒత్తిడి తెచ్చి ఈ రోడ్డును నేషనల్ హైవేగా అప్‌గ్రేడేషన్ చేసేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉంది.


కోడుమూరు-ఎమ్మిగనూరు వయా గోనెగండ్ల ప్రధాన రహదారి

ఆ రెండు రోడ్లు కూడా..!

కర్నూలు - బళ్లారి వయా కోడుమూరు, ఆలూరు ప్రధాన రహదారిని జాతీయ రాహదారిగా విస్తరించాలనే ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగులో ఉంది. ఇది జిల్లాలో అన్ని నియోజకవర్గాలను అనుసంధానం చేసే కీలకమైన రోడ్డు. కర్నూలు నుంచి కోడుమూరు, దేవనకొండ, ఆస్పరి మీదుగా ఆలూరు వరకు, హాలహర్వి మండలం ఛత్రగుడి నుంచి మోకా మీదుగా 126 కిలోమీటర్లు నేషనల్ హైవేగా అప్‌గ్రేడేషన్ చేయాలి. మంగళవారం ప్రారంభమైన జిల్లా కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లేందుకు కలెక్టరు పి.రంజిత్‌బాషా నివేదికతో వెళ్లారు. కర్నూలు ఎమ్మెల్యే, మంత్రి టీజీ భరత్ సహ కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్‌లు నేషనల్ హైవేగా విస్తరణకు కృషి చేయాలి.

- కాల్వబుగ్గ - ఎమ్మిగనూరు వయా రామళ్లకోట, వెల్దుర్తి, లద్దగిరి, కోడుమూరు, గోనెగండ్ల మీదుగా 110 కిలో మీటర్ల రోడ్డును జాతీయ రహదారిగా విస్తరించి కర్నూలు - చిత్తూరు వయా నంద్యాల జాతీయ రహదారి, బళ్లారి-జడ్చర్ల వయా ఎమ్మిగనూరు, మంత్రాలయం జాతీయ రహదారి-167ను అనుసంధానం చేయాలనే ప్రతిపాదనను కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖకు ప్రతిపాదన పంపారు. ముఖ్యంగా కోడుమూరు-ఎమ్మిగనూరు వయా గోనెగండ్ల రోడ్డు అధ్వానంగా ఉంది. ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని నియోజకవర్గాల ప్రజలు వివిధ పనుల కోసం కర్నూలు రావాలంటే ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. గత ఎన్నికల్లో ఎమ్మిగనూరు టీడీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి నేషనల్ హైవేగా విస్తరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆయనతో పాటు కోడుమూరు, పత్తికొండ, పాణ్యం ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, కేఈ శ్యాంబాబు, గౌరు చరితమ్మలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం

గుత్తి-మాన్వి వయా పత్తికొండ, ఆదోని, కర్నూలు-బళ్లారి వయా కోడుమూరు, ఆలూరు, కాల్వబుగ్గ-ఎమ్మిగనూరు వయా వెల్దుర్తి, కోడుమూరు ప్రధాన రోడ్లను జాతీయ రహదారులుగా విస్తరించాలని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు పంపాం. రెండేళ్లుగా కేంద్రంలో ప్రతిపాదనలు పెండింగులో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం నేషనల్ హైవేగా అప్‌గ్రేడేషన్‌కు ఆమోదం తెలిపి నిధులు ఇస్తే నిబంధనలు ప్రకారం డీపీఆర్ తయారు చేసి దశల వారిగా రోడ్డును విస్తరిస్తాం.

\- శంకర్‌రెడ్డి, ఈఈ, జాతీయ రహదారుల శాఖ (ఎన్‌హెచ్), కర్నూలు

నేలకొరిగిన అరటి

నష్టాల ఊబిలో రైతన్న


నేలకొరిగిన అరటి పంట

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో సాగు చేసిన అరటి పంట నేలకొరిగింది. దీంతో లక్షలు వెచ్చించి పంటను సాగుచేసిన రైతన్నలు నష్టాల పాలయ్యారు. మండలంలో చెన్నాపురం, బోడబండ, దేవిబెట్ట గ్రామాల్లో దాదాపు తొమ్మిది ఎకరాల వరకు రైతులు ఈ ఏడాది అరటి పంటలను సాగు చేశారు. అయితే పంట ఏపుగా పెరిగి కాయలు కాసే సమయంలో ఈదురు గాలులు, వర్షం రావడంతో అరటి మొక్కలు నేలకొరిగాయి. దీంతో రైతన్నలు పంటను కాపాడుకునేందుకు కట్టెలను అడ్డుపెట్టడం, తాళ్లతో కట్టి కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. నష్టపోయిన రైతన్నలను ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


నేలకొరిగిన అరటి పంటను చూపుతున్న రైతు గురువ లక్ష్మీకాంత్

నేటి నుంచి వచ్చే నెల 1 వరకు కర్నూలు మార్కెట్ యార్డుకు సెలవు

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డుకు నేటినుంచి ఏప్రిల్ వరకు సెలవు ప్రకటించినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మాట్లాడుతూ వ్యాపారులు ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న కారణంగా ఆర్థిక లావాదేవీలు సరి చూసుకోవాల్సి ఉండటంతో కొనుగోళ్లు జరపలేమన్నారు. రైతులు ఏప్రిల్ 1వ తేదీ వరకు ఎండు మిర్చి, వామును యార్డుకు తీసుకు రావద్దని విజ్ఞప్తి చేశారు.

అర్చకుల మధ్య ఘర్షణ

- కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు

కొత్తపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన కొలనుభా రతి క్షేత్రంలో శివపురం గ్రామానికి చెందిన ప్రధాన అర్చకుడు, దినసరి వేతనం కింద పని చేస్తున్న ఓ అర్చకుడి మధ్య సోమవారం ఘర్షణ జరిగింది. వీరిద్దరూ మంగళవారం కొత్తపల్లి పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ కేశవను వివరణ కోరగా ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చామని చెప్పారు.

కంప్రెషర్ పేలుడులో ముగ్గురికి రిమాండ్

సి. బెళగల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కంప్రెషర్ పేలుడులో ముగ్గురికి రిమాండ్ తరలించినట్లు కోడుమూరు సీఐ తబ్రేజ్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఇలాంటి సంఘటనలు మరోసారి జరగకుండా కంప్రెషర్, యజమాని రాజు, రైతు మోహీనుద్దీన్, డిటోనేటర్లు విక్రయించిన శ్రీనివాసులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. పొలాల్లో డిటోనేటర్లతో గుండ్లు పేలుస్తే తమకు సమాచారం అందజేయాలన్నారు. లైసెన్స్ లేకుండా పేలుడు పదార్థాలను విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏఎస్ఐ నాగయ్య, హెడ్ కానిస్టేబుల్స్ తిమప్ప, గౌడు, దస్తగిరి ఉన్నారు.

ఇరువర్గాల ఘర్షణ.. నలుగురికి గాయాలు

జూపాడుబంగ్లా, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.లింగాపురం గ్రామ పొలిమేరలో పొలం విషయంలో ఇరువర్గాల మధ్య మంగళవారం ఘర్షణ పడ్డారు. ఇరువర్గాలు కట్టెలతో దాడులు చేసుకోవడంతో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ దాడిలో వైసీపీ మద్దతుదారులు పి.లింగాపురం సర్పంచ్ నాగార్జునరెడ్డి, రాజకుమార్ రెడ్డి, రవి జూపాడుబంగ్లా గ్రామానికి చెందిన టీడీపీ మద్దతుదారుడు పెద్దన్న కుమారుడు వెంకటయ్యకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇరువర్గాల పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేసుకున్నారు. ఇరువర్గాలను విచారించి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

బండిఆత్మకూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): సంతజూటూరు, బండిఆత్మకూరు మధ్య కారు బైకును ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం పెద్ద నాగులవరం గ్రామానికి చెందిన వెంకట నాగరాజు(21) ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. నారాణపురం గ్రామానికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్ఐ అక్బర్ తెలిపారు.

గుర్తు తెలియని భక్తురాలి మృతి

మంత్రాలయం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంగభద్ర రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని భక్తురాలు (50) మృతి చెందినట్లు మాధవరం హెడ్ కానిస్టేబుల్ వీరేష్ తెలిపారు. మంగళవారం ఉదయం రాఘవేంద్రస్వామిని దర్శించుకుని తుంగభద్ర రైల్వేస్టేషన్‌కు వచ్చింది. ఎండ వేడిమి తట్టుకోలేక మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి దగ్గర చీర, కొబ్బరికాయ ఉన్నట్లు గుర్తించారు. ఎటువంటి ఆచూకీ లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని మహిళ మృతదేహంగా పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె వద్ద ఉన్న దుస్తులను మాధవరం పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య



ఉదయ్ (ఫైల్)

ఆదోని, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈఘటన ఆదోని పట్టణంలోని క్రాంతినగర్ కాలనీలో సోమవారం రాత్రి చోటు చేసుకోగా, మంగళవారం గుర్తిం చారు. వివరాలు.. పట్టణంలోని క్రాంతినగర్ కాలనీకి చెందిన ఉదయ్ (21) బేల్దారి పని చేస్తూ కుటుం బానికి ఆసరాగా ఉండేవాడు. సోమవారం రాత్రి ఇంటికి వచ్చాక రూములో వెళ్లి తలుపు వేసుకు న్నాడు. ఉదయం ఎంతకీ తలుపు తీయకపోవడం తో కుటుంబ సభ్యులు లోపలికి చూడగా స్లాబుకు ఉన్న కొక్కానికి ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించాడు. పోలీసులకు సమాచారం అందించి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడేవాడని తల్లి నరసమ్మ పేర్కొంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని టూ టౌన్ పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



గురుస్వామి

ఆలూరు రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో చికిత్స పొందుతూ వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. మండలంలోని కురవల్లి గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున గ్యాస్ సిలిండర్ పేలడంతో గురుస్వామి, భార్య గాయత్రీతో పాటు కుమారుడు ధర్మకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించిన విషయం విధితమే. తీవ్ర గాయాలైన గురుస్వామి (39) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. గురుస్వామి మృతిపై గ్రామ సర్పంచ్ ఉప్పర రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు ఈరప్ప, మల్లయ్య, పెద్దయ్య ప్రగాఢ సానుభూతి తెలిపారు.

'రైతుల ఆస్తుల జప్తు దారుణం'

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అప్పులు కట్టలేదన్న కారణంతో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులు రైతుల ఇళ్లకు వెళ్లి టీవీలు, మోటారు సైకిళ్లను తీసుకెళ్లడం దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య మండిపడ్డారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రైతులు పంటలు పండక, గిట్టుబాటు ధర అందక పంట సాగు కోసం చేసిన అప్పులు దిద్దలేక వలసబాట పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం తదితర నియోజకవర్గాల్లో గ్రామాలకు గ్రామాలు వలసలకు వెళ్లడంతో ఖాళీ అయిపోయాయని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం వాళ్లను ఆదుకోవాల్సింది పోయి ఉపాధిని కల్పించకుండా రుణ బకాయిలు చెల్లించాలని ఏ విధంగా ఆదేశిస్తుందని గిడ్డయ్య ప్రశ్నించారు. ఆలూరు నియోజకవర్గంలోని బెల్డోనలో సోమవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులు రైతుల ఇళ్లలోకి చొరబడి టీవీలు, మోటారు సైకిళ్లు ఎత్తుకెళ్లడం దారుణమని, మరోసారి ఇటువంటి దారుణాలు జరగకుండా అన్ని బ్యాంకుల అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని కోరారు. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ

కర్నూలు న్యూసిటీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఇటీవల ప్రిసైడింగ్ అధికారులు నియమితులయ్యారు. జడ్పీలో సీఈవో జి.నాసరరెడ్డి ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. జిల్లా పరిషత్ కో అప్టెడ్ ఎన్నిక పర్యవేక్షణలో జడ్పీ సమావేశం భవనంలో జరుగుతుందన్నారు. అదేవిధంగా తుగ్గలి, వెల్దుర్తి ఎంపీపీ ఎన్నికలు, క్రిష్ణగిరి కో అప్టెడ్ ఎన్నికలు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. 27న నామినేషన్, పరిశీలన, జాబితా ప్రచురణ, అదేరోజు మధ్యాహ్నం ఎన్నికలు జరుగుతాయన్నారు. జడ్పీ కో అప్టెడ్ ఎన్నికకు సంబంధించి ఎంపీ,ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలకు నోటీసులు జారీ చేస్తామన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటి కలెక్టర్ అజయ్ కుమార్, సోషల్ వెల్ఫేర్ ఈడీ తులసిదేవి, సెట్కూరు సీఈవో వేణుగోపాల్, జడ్పీ ఏవో సి.రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గాడి తప్పిన బీఎడ్ విద్య

- తరగతులు, ప్రాక్టికల్స్ లేకున్నా పట్టాలు
- ఈడబ్ల్యూఎస్ కోటాలో అడ్డగోలుగా అడ్మిషన్లు





కర్నూలు అర్బన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): డబ్బు చెల్లిస్తే చాలు తరగతులకు హాజరు కాకున్నా రికార్డులు రాయకున్నా బీఈడీ పట్టాలు ఇచ్చేస్తున్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు లేక పోయినా పర్వాలేదంటూ అడ్మిషన్లు చేసుకుంటున్నారు. రాయలసీమ యూనివర్సిటీకి అనుబంధంగా దాదాపు 45 బీఎడ్ కళాశాలు ఉన్నాయి. వీటిలో చాలా వాటికి సొంత భవనాలు లేకున్నా వర్సిటీ అధికారులు అనుమతులు ఇచ్చారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కర్నూ లు నగరంలో-3, జోన్-2, నంది కొట్కూరు-1 బీఎడ్ కళాశాలకు కనీసం సొంత భవనాలు కూడా లేవు. వర్సిటీలోని ఓ అధికారికి సమీప బంధువైన కళాశాల యజమాని నగరంలోని సీ క్యాంప్ సమీపంలోని శకుంతల కళ్యాణ మండపం దగ్గర ఒక రూమ్‌లో నడుపుతున్నట్లు విద్యార్థి సంఘాల నాయకులు ఉప కులపతికి ఫిర్యాదు చేశారు. జిల్లాలోని కొన్ని బీఎడ్ కళాశాలలు ఈడబ్ల్యూఎస్ క్యాస్ట్ సర్టిఫికెట్ లేకున్నా ఇతర రాష్ట్రాల విద్యార్థులను చేర్చుకుంటున్నారు. నంద్యాల జిల్లా డోన్ పట్టణంలో బీఎడ్ కళాశాల విద్యార్థులకు నిబంధనల ప్రకారం అదే జిల్లాలో పరీక్షలు జరపాలి. కానీ పరీక్షలను కర్నూలు జిల్లాలో నడపడం వివా దాస్పదంగా మారింది.

- ఉమ్మడి జిల్లాలో ఏ ఒక్క కళాశాల తరగతులు జరపకున్నా, ప్రాక్టికల్స్ నిర్వహించకున్నా వర్సిటీ అధికారులు యాజమాన్యాలతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని విద్యార్థులకు 80 శాతం బీఎడ్ పట్టాలు ఇస్తున్నారు. కళాశాల యాజమాన్యాలు ఇచ్చే ముడుపులకు కక్కుర్తి పడి బీఎడ్ విద్యార్థులు రాకున్నా బ్లాక్ బోర్డు టీచింగ్, ప్రాక్టికల్స్‌కు వచ్చినట్లు సంతకాలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో ఏ ఒక్క కళాశాలకు ఎన్‌సీటీఈ(నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్) అనుమతులు లేకున్నా ఉర్దూ అడ్మిషన్లు చేర్చుకోవడం గమనార్హం. కళాశాల్లో వంద మంది విద్యార్థులకు 16 మంది, 50 మంది విద్యార్థులకు 8 మంది అధ్యాపకులు ఉండాలి. సీడీసీ విభాగం ప్రతి ఏటా అధ్యాపకుల జాబితాను పరిశీలించి అప్రూవు చేయాల్సి ఉంటుంది. కళాశాలల్లో మౌలిక వసతులను పరిగణలోకి తీసుకుని అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది.

బీఈడీ అడ్మిషన్లు..

బీఈడీ కాలేజీల్లో సోషియల్ -25, బయోలజీ-20, మ్యాచ్ అండ్ ఫిజిక్స్ రెండికి కలిపి -20, ఇంగ్లీష్ -10 ప్రకారం కన్వీనరు కోటాలో విద్యార్థులను చేర్చుకోవాలి. మేనేజ్ మెంట్ కోటా కింద మరో 25 శాతం విద్యార్థులను చేర్చుకోవాలి. కానీ ఈ విధానం బీఈడీ కళాశాలల్లో అమలు కావడం లేదు. స్పాట్ అడ్మిషన్ల పేరుతో ఒకే సబ్జెక్టుకు ఇతర రాష్ట్రాల విద్యార్థులను చేర్చుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. 60 శాతం ఇతర రాష్ట్రాల విద్యార్థులతో కళాశాలలు నడుపుతున్నారని ఉన్నత విద్యామండలికి కొందరు విద్యార్థులు గత సోమవారం ఫిర్యాదు చేశారు. దీంతో ప్రభుత్వం మరోసారి బయోమెట్రిక్ విధానాన్ని అమలు అంశం తెరపైకి వచ్చినట్లు తెలిసింది.

అన్నింటినీ పరిశీలిస్తాం



బీఎడ్ కళాశాలల తీరును స్వయంగా పరిశీలించి లోపాలను సరి చేస్తాను. సొంత భవనాలు లేకుండా అనుమతులు ఇవ్వడం కుదరదు. ఏవైనా అలా ఉంటే విచారించి తదుపరి చర్యలకు ఆదేశిస్తాం. **- వి. వెంకట బసవరావు, ఉపకులపతి, రాయలసీమ యూనివర్సిటీ**

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

- జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

కర్నూలు న్యూసిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో తాగునీటి ఎద్దడి రాకుండ చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జడ్పీ మినీ సమావేశ భవనంలో ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, పంచాయతీ అధికారి, ఇరిగేషన్, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న పీఆర్ రోడ్లకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. చెరువులలో నీటి సామర్థ్యంత ఎంత వరకు ఉంది..ఎన్ని చెరువులను నింపాలనే విషయాన్ని ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డీపీవోను ఆదేశించారు. సమావేశంలో జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి హుండీ ఆదాయం రూ.39.66 లక్షలు

బేతంచెర్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్. రంగాపురం గ్రామ శివారులోని మద్దిలేటి నరసింహస్వామి, మహాలక్ష్మి అమ్మవార్ల హుండీ లెక్కింపులో రూ.39.66 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు వెల్లడించారు. 58 రోజులకు సంబంధించిన హుండీ లెక్కింపును మంగళవారం దేవదాయశాఖ అధికారి జనార్దన్, ఈవో రామాంజనేయులు సమక్షంలో లెక్కించారు. ఈ లెక్కింపులో రూ.34,28,985 నగదు, 47 గ్రాముల బంగారు, 1.3 కిలోల వెండి వచ్చింది. అలాగే మహాలక్ష్మి అమ్మవారి హుండీ లెక్కింపులో రూ.5,27,081 నగదు కలిపి మొత్తం రూ.39,66,066 నగదు సమకూరింది. ఆలయ వేద పండితులు, అర్చకులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.



హుండీ డబ్బులను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

మసీదులో చోరీ

కొత్తపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొకెరంచ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి మసీదులో గుర్తు తెలియని వ్యక్తులు తాళాన్ని పగులకొట్టి చోరీ చేశారు. రంజాన్ మాసం కావడంతో ముస్లింలు రాత్రి 10 గంటల వరకు ప్రార్థనలు చేసుకుని వెళ్లిపోయారు. మరుసటి రోజు ఉదయం మసీదులో ఇన్వర్టర్‌కు అమర్చిన రూ.13 వేలు విలువ చేసే బ్యాటరీ, గ్యాస్ సిలిండర్‌ను దొంగలించుకు వెళ్లారని తెలిపారు. మంగళవారం కొత్తపల్లి పోలీసుల ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

యువకుడిపై దాడి

నంద్యాల క్రైం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయమాల్పురం గ్రామంలో ఆల్వకొండ మధు అనే యువకుడిపై అదే గ్రామానికి చెందిన పిడతల వినోద్, పిడతల రాజారావు, పిడతల కిషోర్, పిడతల భాస్కర్ మంగళవారం కట్టెలతో దాడి చేశారు. మధు, పిడతల వినోద్ ఇద్దరు నంద్యాల పట్టణంలో ఏదో విషయంపై తిట్టుకున్నారు. ఇంటికి వచ్చిన మధు జరిగిన విషయాన్ని తన తండ్రి రాజేష్‌కు చెబుతుండగా నలుగురు వచ్చి కట్టెతో దాడి చేశారు. దీంతో మధుకు గాయాలయ్యాయి. రాజేష్ గట్టిగా కేకలు వేయడంతో బంధువులు వచ్చి మధును విడిపించారు. మధును నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. మధు తండ్రి నంద్యాల తాలుకా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చైన్ స్నాచర్ అరెస్టు

నంద్యాల క్రైం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో చైన్ స్నాచర్‌ను అరెస్ట్‌చేసి సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ మంద జావలి ఆల్ఫోన్స్ తెలిపారు. మంగళవారం టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏఎస్పీ వివరాలు వెల్లడించారు. ఎన్‌జీవో కాలనీకి చెందిన పగడాల లక్ష్మీరాజ్యం ఈ నెల 22న కూరగాయలు కొని ఇంటికి వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తి కత్తితో బెదిరించి ఆమె మెడలోని సుమారు 3.4 తులాల బంగారు తాళిబొట్టు చైన్‌ను లాక్కొని పరారయ్యాడు. కేసుకు సంబంధించి టూ టౌన్ సీఐ ఇస్మాయిల్, సీసీఎస్ సీఐ సురేష్‌కుమార్, టూ టౌన్ ఎస్ఐ సుధాకర్‌రెడ్డి, సిబ్బంది విచారణ చేసి నిందితుడు దేవనగర్‌కు చెందిన మొట్టి పెద్ద హుసేని అలియాస్ యేసు రాజును మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఏఎస్పీ తెలిపారు. విచారణ చేపట్టగా ఇటీవలే నంద్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రాంతినగర్‌లో ఒక మహిళ మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసును ఈ నెల 23న లాక్కొని వెళ్లినట్లు తేలిందన్నారు. మహిళలిద్దరి నుంచి చైన్ స్నాచింగ్‌కు పాల్పడి లాక్కెళ్లిన బంగారు గొలుసులను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ తెలిపారు. సిబ్బందిని అభినందించారు.

నిధులు లేక నిలిచిన పనులు



పాములపాడు మండలం చెలిమిల గ్రామంలో అసంపూర్తిగా ఉన్న రైతు భరోసా కేంద్రం



కొత్తపల్లె మండలం కొక్కెరంచ గ్రామంలో నిలిచిపోయిన సచివాలయం భవనం

- అర్ధాంతరంగా ఆగిన సచివాలయాలు, ఆర్బీకేల నిర్మాణాలు
- అసంపూర్తి భవనాలపై దృష్టి సారించిన ప్రభుత్వం

నంద్యాల హస్పిటల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాల పనులు నిధులు లేక నిలిచి పోయాయి. నంద్యాల జిల్లాకు కేటాయించిన 415 సచివాలయాలకుగాను రూ.180 కోట్లు అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో జిల్లాలో 361 సచివాలయ భవనాల నిర్మాణాలను చేపట్టారు. అందులో 292 సచివాలయాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. 69 సచివాలయాలకు నిధులు మంజూరు చేయకపోవడంతో చివరి దశలో నిలిచిపోయాయి. మరో 54 సచివాలయాలు బేసెమెంట్‌కే పరిమితమయ్యాయి.

రైతుల భరోసా కేంద్రాల పరిస్థితీ అంతే...

జిల్లాకు 394 రైతుభరోసా కేంద్రాలు మంజూరు కాగా 281 ఆర్‌బీకే కేంద్రాలు నిర్మాణదశలో ఉన్నాయి. అందులో 222 ఆర్‌బీకేలు పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తెచ్చారు. 59 ఆర్‌బీకే కేంద్రాలు నిధులు లేమితో నిలిచిపోయాయి. మరో 113 ఆర్‌బీకేలు బేస్‌మెంట్‌కే పరిమితమయ్యాయి.

అసంపూర్తి భవనాలపై..

అసంపూర్తిగా ఉన్న సచివాలయాలు, ఆర్బీకేలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వెంటనే కలెక్టర్‌లతో పూర్తి స్థాయి నివేదికను ప్రభుత్వం కోరింది. ఇందులో భాగంగా జిల్లాలో అసంపూర్తిగా ఉన్న సచివాలయాల నిర్మాణానికి రూ.17 కోట్ల మేర నిధులు అవసరమని కలెక్టర్ ద్వారా ప్రతిపాదనలు పంపారు.

రూ.126 కోట్ల బకాయిలు

వైసీపీ ప్రభుత్వంలో రోడ్ల భవనాల శాఖకు దాదాపు రూ.126 కోట్ల బిల్లులు పెండింగ్ ఉన్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో 59 పనులకు గాను ఈ బకాయిలు కాంట్రాక్టర్‌లకు చెల్లించాల్సి ఉంది. దాదాపు 70 శాతం పనులు పూర్తి చేశారు. బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. అంతేగాకుండా ఎండీఆర్ స్కీమ్ కింద రెండు పనులు మంజూరు కాగా కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టకపోవడంతో ప్రభుత్వం వాటిని రద్దు చేసింది. రూ.5 కోట్లతో ఆళ్లగడ్డ-మాయలూరు మధ్యలో కుందూ నదిపై వంతెన నిర్మాణం చేపట్టాలి, అలాగే రూ.2 కోట్లతో బ్రాహ్మణకొట్కూరు - మిడుతూరు మధ్యలో హైలెవల్ బ్రిడ్జి పనులు ప్రారంభించకపోవడంతో పనులను రద్దు చేశారు.

ఉల్లి సాగులో కర్నూలు టాప్

- ఉద్యాన శాఖ జిల్లా అధికారి రామాంజనేయులు



మాట్లాడుతున్న ఉద్యాన శాఖ జిల్లా అధికారి రామాంజనేయులు

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా ఉల్లి పంట సాగులో ప్రత్యేక గుర్తింపు పొందడమే కాకుండా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని ఉద్యాన శాఖ జిల్లా అధికారి రామాంజనేయులు అన్నారు. మంగళవారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఉల్లి సాగులో మేలైన యాజమాన్య పద్దతులపై శిక్షణా కేంద్రంలో రైతులకు శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి రామాంజనేయులు మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడి, నాణ్యత, నిల్వలపై అవగాహన పెంచుకుని ఆచరించాలన్నారు. ఉల్లి పంట సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు ఉల్లి రైతులకు అవసరమైన ఉల్లి నాటు యంత్రం, ఉల్లి నిల్వ గోదాములు ఏర్పాటు చేసుకుని రైతులు లబ్ధి పొందాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, ఏపీడీ రాజాకృష్ణారెడ్డి, వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త రాగూర్ నాయక్, ఆర్‌డీఎఫ్ టెక్నికల్ ఆఫీసర్ శరవణన్, మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ, క్లస్టర్ వర్సిటీల ఇన్‌చార్జి వీసీగా ఉమ

కర్నూలు అర్బన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రాయలసీమ, క్లస్టర్ యూనివర్సిటీల ఇన్‌చార్జి ఉపకులపతిగా పద్మావతి యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమకు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 11 వరకు ప్రస్తుతం ఉపకులపతిగా రెండు వర్సిటీలకు కొనసాగుతున్న డాక్టర్ వెంకట బసవరావు అమెరికాలోని ఆరిజోనా స్టేట్ యూనివర్సిటీకి తన వ్యక్తిగత పర్యటనకు వెళ్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

మహిళా మార్ట్‌ను ఎందుకు మూసేశారు?

● మహిళల సొమ్ముతో జగన్ సర్కారు ఏర్పాటు
● నష్టాలు సాకుతో వదిలించుకున్న గత ప్రభుత్వం
● మార్టులోని సరుకులు మాయం
● ఆందోళన చెందుతున్న మహిళలు

కర్నూలు న్యూసిటీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పట్టణ మహిళా సమాఖ్యల్లోని పొదుపు మహిళల సొమ్ముతో నగరంలో రెండు సంవత్సరాల క్రితం ప్రారంభించిన మహిళా మార్ట్‌ను నష్టాల సాకుతో మూసేశారు. గత వైసీపీ ప్రభుత్వం పొదుపు మహిళల సొమ్ముతో ఈ మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేసింది. ఆ తర్వాత కొద్ది నెలలకే వ్యాపారం సరిగ్గా జరగకపోవడంతో నష్టాల బాట పట్టింది. దీనికి తోడు అందులోని సరుకులను కొందరు మాయం చేశారు. మార్ట్‌లో చోటుచేసుకున్న అక్రమాలతోనే ఈ పరిస్థితి నెలకొందని కొందరు సభ్యులు చెబుతున్నారు. తమ పెట్టుబడి మాయం కావడంతో పొదుపు మహిళల్లో ఆందోళన చెందుతున్నారు.

● మహిళా మార్ట్.. మాయాజాలం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్థిక స్వావలంబన కోసం నగరంలోని సి. క్యాంపులో జగన్న మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశారు. 2023 జూన్ 20న ఈ మార్ట్‌ను అట్టహాసంగా అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. నగర పాలక పరిధిలోని శ్రీ శక్తి మదర్ థెరిసా, పుణ్యవతి, స్వరాజ్యం, లిటిల్ రోజ్.. ఐదు సమాఖ్యలు ఒక్కొక్క సమాఖ్య రూ.10 లక్షల వాటాతో మొత్తం రూ.50 లక్షల బ్యాంక్ అకౌంట్‌తో ప్రారంభించారు. అంతే కాకుండా 16 లక్షలు డిపాజిట్ చేశారు. మొత్తం 44 వేల మంది పొదుపు మహిళలు ఒక్కొక్కరి నుంచి రూ.150 చొప్పున వసూలు చేశారు. మహిళా మార్ట్ ప్రారంభం నుంచే అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రారంభానికి ముందు మెయింటెనెన్స్ కోసం రూ.28 లక్షలు ఖర్చు చేశారు. అవసరం లేకున్నా ఆర్భాటం కోసం ఏసీలు ఏర్పాటు చేసి మొత్తం రూ.28 లక్షలు ఖర్చు అయినట్లు చూపించారు. పొదుపు సంఘాలు కావడంతో నెలకు రూ.6 వేలకు అద్దె ఇచ్చారు.

● అధికారులదే పెత్తనం..

పేరుకే పట్టణ సమాఖ్య అధీనంలో ఉన్నా.. పర్యవేక్షణ మొత్తం అధికారులే చేసినట్లు తెలుస్తోంది. సుమారుగా రూ.10 లక్షలతో సరుకులతో మార్ట్ ఏర్పాటు చేశారు. మార్ట్ నిర్వహణ, అమ్మకాలు, కొనుగోలు, పర్యవేక్షణ, నిర్వహణ కమిటీల ద్వారా జరగాలి. అలా కాకుండా ఏకపక్ష ధోరణితో లావాదేవీలు జరిగినట్లు తెలిసింది. సరుకులు అమ్ముడు పోవడం లేదనే కారణంతో పొదుపు మహిళలు తప్పని సరిగ్గా మార్ట్‌లోనే కొనాల్సిన ఆర్పీలను మానసికంగా వేధించారు.

● నష్టం పేరుతో మూత..సరుకులు మాయం

సరుకుల ధర కూడ ఎక్కువగా ఉండటం, నాణ్యత లేకపోవడం వల్ల మార్ట్‌కు కొనుగోలుదారులు లేక ఇబ్బందులు ఏర్పడ్డాయి. సీఓలకు మార్ట్ దగ్గర డ్యూటీ వేసి ప్రతి ఆర్పీ ప్రతి సభ్యురాలితో రూ.500 సరుకులు కొనేలా చేయాలని ఒత్తిడి చేసి కొన్నాళ్లు మమ అనిపించారు. రూ.13,40,000 లాభాలు వచ్చాయని డిపాజిట్ చేయించారు. ఆ డబ్బులు ఏమైపోయిందీ సభ్యులకు ఇప్పటికి అర్థం కావడం లేదు. మార్ట్‌లో కీలక పాత్ర వహించే ఓ టీఎల్ఎఫ్ కార్యదర్శి చికిత్స కోసం వెళ్లడం, మేనేజర్‌ను ఎంపిక చేసుకుని మార్ట్ లావాదేవీలు నిర్వహణకు పూనుకోవడంతో రోజు రోజుకూ బ్యాంక్ బాలెన్స్ తగ్గింది. దీంతో అందులోని సరుకులు ప్రతిరోజు మాయం అవుతూ వచ్చాయి. చివరకు మార్ట్‌ను మూతవేశారు. మార్ట్ ఖాతాలోని సొమ్ము మొత్తం కొందరు స్వప్రయోజనాలకు వాడుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తమ నుంచి వసూలు చేసి డబ్బులు మాయం కావడంతో పొదుపు మహిళల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

● లాభాల పేరుతో మోసం..



సి.క్యాంపులో మూతబడిన మహిళా మార్ట్

పెట్టుబడి పెట్టిన సభ్యులకు లాభాలు వస్తే పంచుతామని నమ్మబలికారు. అయితే నష్టం రావడంతో చెప్పపెట్టకుండా మార్ట్‌ను మూతవేశారు. సరుకులలో నాణ్యత లేకపోవడం, ధరలు ఎక్కువగా ఉండటంతో మార్ట్‌లో కొనుగోలుకు ఎవ్వరూ సిద్ధం కాకపోవడంతో నష్టాలు వచ్చాయి. దీంతో పాటు నిర్వాహకుల అజమాయిషీ లేకపోవడంతో సీఓల నుంచి పీడీ వరకు వారి ఇళ్లకు సరుకులు వెళ్లాయిని కొందరు ఆరోపిస్తున్నారు. మహిళా మార్ట్‌లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించి పెట్టుబడులు వెనక్కి ఇప్పించాలని సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

సరుకులన్నీ మాయం చేశారు..



మహిళా మార్ట్ నిర్వహణ సరిగ్గా లేదు. మార్ట్‌ను నష్టాల బాట పట్టించి సరుకులన్నీ మాయం చేశారు. లాభాలు వస్తే అందరికీ సమానంగా పంచుతామని మా ద్వారా పెట్టుబడి పెట్టించి మోసం చేశారు. నష్టం వచ్చిందనే నెపంతో పెట్టుబడి ఇవ్వడం లేదు.

\- లీలావతి, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ లీడర్

విచారణ జరిపించాలి



మార్ట్‌లో జరిగిన అక్రమాలపై కాలయాపన లేకుండా విచారణ జరిపించాలి. మార్ట్ ప్రారంభం నుంచి అనేక అను మానాలు వ్యక్తమవుతున్నాయి. ఎక్కడైనా వ్యాపారం చేస్తే లాభం వస్తుంది. మరి ఇక్కడ నష్టం వచ్చిందని చెబుతు న్నారు. ఓబీలకు తెలియకుండా వ్యవహరించడం వల్లే నష్టం వచ్చింది. నాణ్యత లేకున్న రూ.500 నుంచి రూ.1000 లక్ష్యాలు విధించి ఆర్పీల చేత కొనుగోలు చేయించారు. చివరకు ఆర్పీలు మాన సిక వేదనకు గురై నిద్రలేని రాత్రులు గడిపారు.

\- ఉమాదేవి, నగర కార్యదర్శి, మెప్మా ఉద్యోగుల సంఘం

హుండీ ఆదాయం లెక్కింపు


డబ్బులను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

కోడుమూరు రూరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరంట్ల లక్ష్మీమాధవస్వామి ఆలయ హుండీ లెక్కింపు మంగళవారం చేపట్టినట్లు ఈవో గుర్రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాత్కాలిక హుండీ నుంచి రూ. 5,38,977, శాశ్వత హుండీ రూ. 5,54,446, అన్నదానం హుండీ రూ. 2,78,436లు సమకూరినట్లు తెలిపారు. అంతేకాకుండా టికెట్ల విక్రయం ద్వారా రూ. 1,46,100 దుకాణాల నుంచి రూ.37,230 చందా రూపేణా రూ. 74,260లు వచ్చినట్లు వివరించారు. హుండీ లెక్కింపును దేవదాయ ఇన్‌స్పెక్టర్ రమేష్ పర్యవేక్షించారు. సర్పంచ్ బాలక్రిష్ణ, పూజారులు, పెద్దలు పాల్గొన్నారు.

అమ్మవారికి బంగారు ముక్కెర


ఆలయ సిబ్బందికి బంగారు ముక్కెర అందజేస్తున్న భక్తులు

గూడూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): గూడూరు మండలంలోని కె నాగలాపురం సుంకులాపరమేశ్వరి అమ్మవారికి భక్తులు బంగారు ముక్కెర కానుకగా సమర్పించినట్లు ఆలయ సిబ్బంది కేశవ తెలిపారు. మంగళవారం పల్లెదొడ్డి గ్రామానికి చెందిన పాలూరు లక్ష్మీనారాయణ, వరలక్ష్మి దంపతులు అమ్మవారికి 5.8 గ్రాముల బంగారు ముక్కెర కానుకగా సమర్పించినట్లు ఆలయ సిబ్బంది తెలిపారు.

ప్రత్యేక కౌంటర్లను సద్వినియోగం చేసుకోవాలి


ప్రత్యేక కౌంటర్‌ను పరిశీలిస్తున్న మేనేజర్ చిన్నరాముడు

కర్నూలు న్యూసిటీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం పన్నుల చెల్లింపునకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేషన్ మేనేజర్ చిన్న రాముడు సూచించారు. మంగళవారం ఆయన మద్దూర్‌నగర్ 62వ సచివాలయంలోని ప్రత్యేక కౌంటరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని దూరప్రాంతాల ప్రజలు పన్నులు చెల్లించేందుకు వ్యవప్రయాసాలతో కార్యాలయానికి రావాల్సిన అవసరం లేకుండా మద్దూర్‌నగర్‌తోపాటు కల్లూరు 85వ సచివాలయం, బాలా జీనగర్ 104 సచివాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 31తో ఆర్థిక సంవత్సరం ముగుస్తుందని, ప్రజలు సత్వరమే పన్ను లు చెల్లించి నగరాభివృద్ధి తోడ్పాటు అందించాలని ఆయన కోరారు.

బకాయిలపై 50 శాతం వడ్డీ మాఫీ

కర్నూలు న్యూసిటీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నగరంలో ఆస్తి, తాగునీటి కొళాయి పన్ను చెల్లింపుదారులంతా ఈ నెల 31వ తేదీలోగా బకాయిలను చెల్లించి 50శాతం వడ్డీ మాఫీ రాయితీ పొందాలని కార్పొరేషన్ కమిషనర్ రవీంద్రబాబు మంగళవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి, తాగునీటి కొళాయి పన్నుల బకాయిలను ఏక మొత్తంలో చెల్లించిన వారికి 50 శాతం వడ్డీ మాఫీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కొన్నేళ్లుగా బకాయిలు చెల్లించాలని వివిధ రూపల్లో కోరుతున్నప్పటికీ, కొంతమంది బకాయిదారులు మొండిగా వ్యవహరించి అంగీకరించడం లేదని కమిషనర్ విన్నూత్నంగా బకాయిదారులకు సచివాలయ సిబ్బందితో వాట్సాప్ ద్వారా లేఖ పంపారు.

గూడూరు: నగర పంచాయతీ పరిధిలో పన్ను చెల్లింపుదారులంతా ఈ నెల 31వ తేదీ లోగా ఆస్తి, ఖాళీ స్థలం పన్నుల బకాయిలను చెల్లించి 50శాతం వడ్డీ మాఫీ రాయితీ పొందాలని కమిషనర్ ఏవీ రమేష్ బాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లా డుతూ గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో పన్ను స్వీకరణ కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. సెలవు రోజుల్లో కూడా ఈ కౌంటర్లు పని చేస్తాయ న్నారు. కాబట్టి బకాయిదారులు పన్నులను నగర పంచాయతీ కార్యాలయం కౌంటర్లలో గాని, వార్డు సచివా లయంలో గాని, ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని కమిషనర్ కోరారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు పోరాటం

కర్నూలు అర్బన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమరయోధులు భగత్ సింగ్ ఆశయ సాధన కోసం పోరాడాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ శరత్ కుమార్ అన్నారు. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీలో భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు సురేష్, ఈశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్లిం ఉపాధ్యాయులకు ఇఫ్తార్



మాట్లాడుతున్న డీఈవో శామ్యూల్ పాల్

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): స్థానిక సలాంఖాన్ భవనంలో ఎస్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి అధ్యక్షతన ముస్లిం ఉపాధ్యాయులకు ఇఫ్తార్ ఇచ్చారు. కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌పాల్, రాష్ట్ర పూర్వ అధ్యక్ష, కార్యదర్శులు షణ్ముర్తి, హెచ్.తిమ్మన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ సంఘంలో కూడా లేని విధంగా అన్ని కులాలు, మతాల సంస్కృతులను గౌరవిస్తూ ప్రతి సంవత్సరం ఎస్టీయూ కర్నూలు శాఖ క్రిస్మస్ క్యాండిల్ లైట్, సంక్రాంతి ముగ్గుల పోటీలు, ముస్లింలకు ఇఫ్తార్ ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీకే జనార్దన్, మహ్మద్ షఫీ, ముదాసీర్ అహ్మద్, గోవిందు, గోవిందు నాయక్, సురేష్, ముర్తుజావలి, ఉస్మాన్, అబ్దుల్ రహీం, మొహినుద్దీన్, ఖాజా మొయిద్దీన్, దేవదాసు, సుంకన్న, ముస్లిం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హంద్రీ కబ్జా కేసులో వైసీపీ నాయకుడి అరెస్టు

కర్నూలు క్రైం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గడ్డా వీధికి చెందిన ఉస్తాద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రామయ్య నాయుడు తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉస్తాద్ హంద్రీ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు కబ్జా చేసి పట్టాలు సృష్టించి కొందరికి విక్రయించాడు. ఇటీవల రెవెన్యూ అధికారులు గుర్తించి ప్రభుత్వ భూముల కబ్జాపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు వైసీపీ నాయకుడు ఉస్తాద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

సీఐటీయూ వర్క్‌షాపును జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 12, 13 తేదీలలో జరిగే సీఐటీయూ వర్క్‌షాపును జయప్రదం చేయాలని ఆయిల్ అండ్ రైస్ మిల్ అసోసియేషన్ నగర అధ్యక్షుడు డి.గౌస్‌దేశాయ్ పిలుపుని చ్చారు. మంగళవారం కేకే భవన్‌లో జరిగిన కార్మికుల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక హక్కుల కాపాడుకోవడం కోసం నగరంలో రాష్ట్రస్థాయి వర్క్‌షాపు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ నగర అధ్యక్షుడు నరసింహులు పాల్గొన్నారు

శక్తి యాప్‌ను వినియోగించుకోవాలి

కర్నూలు క్రైం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మహిళలు శక్తి ఎస్ఓఎస్ యాప్ వినియోగించుకోవాలని మహిళా పోలీస్ స్టేషన్ సీఐ విజయలక్ష్మి సూచించారు. మంగళవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసాచారి పర్యవేక్షణలో సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల విద్యార్థినులకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శక్తి టీం సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శాంత, అధ్యాపకులు పల్లవి, సునీత, విద్యార్థినులు పాల్గొన్నారు.

డిమాండ్లను నెరవేర్చాలి

మధ్యాహ్న భోజన సమయంలో ఉద్యోగుల నిరసన

కర్నూలు న్యూసిటీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): వివిధ ఇన్సూరెన్సు సంస్థలలో పని చేస్తున్న ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చకుంటే ఈ నెల 27 నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు హైదరాబాదు ప్రాంతీయ బీమా ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జంధ్యాల రఘుబాబు తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్సు కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ నేషనల్ ఇన్సూరెన్సు, న్యూ ఇండియా, ఓరియంటల్, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్సు కంపెనీలలోని ఉద్యోగులు, అధికారుల వేతన సవరణ ఆగస్టు నుంచి పరిష్కరించకుండా కాలయాపన చేయడం తగదన్నారు. ఫ్యామిలీ పెన్షన్ 30 శాతం పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, శివకుమార్, జయశ్రీ, కృష్ణ, అస్లాం బాషా, రంగనాథ్, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఓర్వకల్లులో బహిరంగ వేలం


వేలంలో పాల్గొన్న అధికారులు

ఓర్వకల్లు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఓర్వకల్లులో రచ్చకట్ట వద్ద షాపులు, బండ్లమెట్టకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలానికి ఎంపీడీవో శ్రీనివాసులు, ఈవోఆర్డీ సుబ్బరా యుడు హాజరయ్యారు. నాలుగు షాపులకు, బండ్లమెట్టకు బహిరంగ వేలం వేయగా, ఒకటో షాపు రూ.15,600, రెండో షాపు రూ.14,400, మూడో షాపు రూ.14,400, నాలుగో షాపు రూ.48వేలు, బండ్లమెట్ట రూ.3,00,500 పాటాదారులు మహ్మద్ హనీఫ్ పాట పాడి దక్కించుకు న్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, టీడీపీ నాయ కులు గోవిందరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు సీపీఎం ధర్నా

కర్నూలు న్యూసిటీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నగరంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కమిటి సభ్యురాలు పి.నిర్మల తెలిపారు. మంగళవారం ఇందిరాగాంధీ నగర్‌లో నిర్వహించిన సీపీఎం ప్రజాచైతన్య యాత్రలో ఆమె పాల్గొని ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కే.అరు ణ, ఎం.కుమారి, పీఎస్.సుజాత, అయ్యమ్మ, పర్వీన్ పాల్గొన్నారు.

సివిల్ సర్వీసు ఖో-ఖో పోటీల్లో కాంస్య పతకం

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి సివిల్ సర్వీసు ఖో-ఖో పోటీల్లో పెద్దహోతూరు జిల్లా పరిషత్ పాఠశాల పీఈటీ చెన్నబసప్ప ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించాడు. ఆర్‌బీఎస్ బెంగళూరు, రాజస్థాన్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర జట్లపై విజయం సాధించాడు. జిల్లా పీఈటీ సంఘం అధ్యక్షుడు జోసెఫ్ లక్ష్మయ్య, కార్యదర్శి చందునాయక్, నిర్వహక కార్యదర్శి కిషోర్, శ్రీనివాసులు, వెంకటేశ్‌లు పీఈటీ చెన్నబసప్పకు అభినందనలు తెలిపారు.


కాంస్య పతకంతో చెన్నబసప్ప

గృహనిర్మాణాన్ని వేగవంతం చేయాలి

సి.బెళగల్ మార్చి 25(ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఈఈ వెంకటదాసు సిబ్బందికి ఆదేశించారు. మంగళవారం మండలంలోని బురాన్‌దొడ్డి, కంబదహల్ గ్రామాల్లో గృహ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు బ్యాంక్ ఖాతాకు ఆధార్ నెంబరు లింక్ చేసుకోవాలన్నారు. ఆయన వెంట డీఈ వాసుదేవుడు, ఏఈ సుమంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.


గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఈఈ

జాతీయ స్థాయి క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులతో డీవీఈవో పరమేశ్వరరెడ్డి, ఆర్ఐవో గురువయ్య శెట్టి

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్+2 పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు మంగళవారం స్థానిక ఆర్ఐవో కార్యాలయంలో డీవీఈవో పరమేశ్వరరెడ్డి, ఆర్ఐవో గురువయ్యశెట్టి ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. ఆర్ఐవో గురువయ్యశెట్టి మాట్లాడుతూ క్రీడాకారులకు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుంకన్న, స్కూల్ గేమ్స్ కార్యదర్శి హర్షవర్దన్, పీడీలు నరసప్ప, భాస్కర్ రెడ్డి, రణదేవ్, రాఘవేంద్ర, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

సి.బెళగల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సి.బెళగల్, ఇనగండ్ల, కంబంధహల్ గ్రామాలలో ఉపాధి పనులను ఎంపీడీవో రాణెమ్మ మంగళవారం తనిఖీ చేశారు. ఆమె మాట్లా డుతూ ఎండల నేపథ్యంలో ఉపాధి కూలీలంతా పనులు త్వరగా ముగించుకొని ఇళ్లకు చేరుకోవాలన్నారు.

మెప్మా అధికారిపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు న్యూసిటీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మెప్మా అధికారి భాస్కర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని లిటిల్ రోజెస్ పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు టి.కుళ్లాయమ్మ అన్నారు. మంగళవారం సీఆర్సీ భవనంలో సమాఖ్య సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కుళ్ళాయమ్మ మాట్లాడుతూ కొత్తగా టీఎల్ఎఫ్ ఓబీల ఎన్నికపై చర్చ జరిగిందన్నారు. కొత్తగా ఓబీలుగా ఉండటానికి సోమశేఖరమ్మ, వీరనారాయణమ్మ, లక్ష్మీదేవిలకు ఎవ్వరు మద్దతు ఇవ్వలేదన్నారు. ఓబీలంతా పాత ఓబీలయిన కుళ్ళాయమ్మ, కే.లక్ష్మీలకు మద్దతు తెలిపారన్నారు. అయితే మెప్మా సీఎంఎం భాస్కర్‌రెడ్డి మెజార్టీ లేని సోమశేఖరమ్మ, వీరనారాయణమ్మ, కె.లక్ష్మీదేవిలను కొనసాగించాలని ప్రయత్నాలు చేస్తున్నారని ఆమె ఆరోపించారు.

వ్యవసాయ పరికరాలకు దరఖాస్తు చేసుకోవాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

సి.బెళగల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందజేస్తున్న వ్యవసాయ పరికరాల కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ సూచిం చారు. మంగళవారం పోలకల్లు రైతు భరోసా కేంద్రంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం 50 శాతం సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందిస్తుంద న్నారు. ఈనెల 31 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈసమావేశంలో ఎంపీఈవోలు ఊర్మిళ, ప్రదీప్, వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో దొంగలు

పార్కింగ్ చేసిన ఆటో టైర్లు, సీట్లు చోరీ

కర్నూలు హాస్పిటల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో దొంగలు రెచ్చిపోతున్నారు. రోగులు సెల్ ఫోన్ల చోరీలు నిత్యం సాధారణంగా మారాయి. కల్లూరు మండలం ఉలిందకొండ చెందిన రాణేమ్మ అనారోగ్యంతో నాలుగు రోజుల క్రితం గైనిక్ వార్డులో చేరింది. భర్త రమేష్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం రాత్రి అడ్మిషన్‌లో ఉన్న భార్య దగ్గరకు ఆటో ను తీసుకుని గైనిక్ వార్డు ఎదుట పార్కింగ్ చేశారు. రాత్రి 11 గంటల వరకు ఆటోను చెక్ చేసి రమేష్ నిద్రపోయాడు. మంగళవారం ఉదయం ఆటోను చూసిన రోగి భర్త నివ్వెరపోయాడు. ఆటో టైర్లు, సీట్లు అద్దాలను దొంగలు ఎత్తుకుపోయారు. ఆటో టైర్లు సీట్లు అద్దాలు చోరీకి గురి కావడంతో కన్నీరు పెట్టుకున్నాడు. ఆసుపత్రిలో రాత్రిపూట సెక్యూరిటీ సూపర్‌వైజర్లు, గార్డులు, పోలీసుల పర్యవేక్షణ కరువైంది. దీంతో దొంగలు అర్ధరాత్రి దాటిన తర్వాత దొంగలు యథేచ్ఛగా వచ్చి చోరీలు చేస్తున్నారు. చాలాసార్లు పోలీసులకు దొంగలను అప్పగించినా దొంగలపై కేసులు పెట్టకుండా మరుసటి రోజు వదిలివేయడంతో వారు మరింతగా రెచ్చిపోతున్నారు. ఆసుపత్రిలో కూడా సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్లు కలిసి 200 మంది ఉండాల్సి ఉండగా.. కేవలం 140 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు.

దీంతో నామమాత్రంగా రద్దీ ఉన్న వార్డులో పని చేస్తూ రాత్రి పూట గస్తీని గాలికి వదిలేయడంతో దొంగతనాలు ఎక్కువవుతున్నాయి. ఇప్పటికైనా ఆసుపత్రి అధికారులు స్పందించి రాత్రి పూట గస్తీని పెంచాలని రోగులు కోరుతున్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఆలూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు గిరి మల్లేష్ గౌడ్ తెలిపారు. ప్రజలు సమస్యలను వినతిపత్రాలు ఇస్తే వాటిని ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ పరిశీలించి సంబంధిత అధికారులకు పంపి పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు.

భూ సమస్యలను పరిష్కరిస్తాం

హాలహర్వి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని ఆర్డీవో భరత్ నాయక్ అన్నారు. మంగళవారం కామినేహాల్ గ్రామంలో భూ తగాదాలున్న రైతులతో మాట్లాడారు.



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో భరత్ నాయక్

సమస్యలను కూర్చుని సమస్య పరిష్కరిం చుకోవాలని, కోర్టుల చుట్టూ తిరిగి డబ్బు, సమయాన్ని వృథా చేసు కోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నజ్మాభాను, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీ, ఆర్ఐ మహేష్, వీఆర్వో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

మద్దికెర, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బురుజుల గ్రామంలో ఉగాది సందర్భంగా ఈ నెల 28, 29 తేదీల్లో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు వీరేష్, కిషోర్, లోకేశ్ మంగళవారం తెలిపారు. విజేతలకు దాతల సహకారంతో బహుమతులు ఇస్తామన్నారు. ముఖ్య అతిథిగా ఎస్ఐ విజయ కుమార్ నాయక్, జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు హాజరవుతున్నారన్నారు. రూ.500లు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 7989329636, 9390497471, 9701623654 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సాగునీటి కోసం పోరాటం



నలకదొడ్డిలో సంతకాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

పత్తికొండ టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పొలాలకు సాగునీటి సాధనకు పార్టీలకతీతంగా పోరాటం చేద్దామని సీపీఐ కార్యదర్శి రాజా సాహెబ్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య రైతులకు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని నలకదొడ్డి, అటికలగుండు గ్రామాల్లో ఎడమ కాలువను పొడిగించాలని రైతులతో సంతకాల సేకరణ చేపట్టారు. పందికోన రిజర్వాయర్ ఎడమ కాలువ పనులు నిలిచిపోయాయ న్నారు. కాలువను పెద్దహుల్తి, దేవనబండ, నలకదొడ్డి, జూటూరు, ఆస్పరి మండలం వెంగాలయదొడ్డి వరకు పొడిగిస్తే.. వేలాది ఎకరాలకు సాగునీరు, గ్రామాలకు తాగునీరు అందించవచ్చన్నారు. సిద్దలింగప్ప, గ్రామ నాయకులు వీరన్న, జగదీష్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులకు నోటీసులు

వెల్దుర్తి టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలోని 12వ వార్డు పరిధిలోని వాగు కబ్జాదారులకు కార్యదర్శి లక్ష్మీనాథ్ నోటీసులు అందజేశారు. మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో కబ్జా నుంచి కాపాడండి



అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న పంచాయతీ సెక్రటరీ లక్ష్మీనాథ్

శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందిం చారు. ఐదు రోజుల్లోపు ఆక్రమించిన స్థలానికి సంబంధించిన పత్రాలు, పట్టాలు ఉంటే సమర్పించాలని లేనిపక్షంలో పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని ఎమ్మెల్యే పార్థసారథి పేర్కొన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో బాధితులకు చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేసుకున్న రోగులకు మంజూరైన రూ. 19.44 లక్షల చెక్కులను 18 చెక్కులను పంపిణీ చేశారు.



హంద్రీనీవా కాలువకు నీరు ఆగిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. వరి పంటకు ప్రస్తుతం నీరు అవసరమని, పొట్ట దశలో ఉన్న పంట చేతికి రావాలంటే మరో 15 రోజులు పాటు కాలువకు నీరు అందిస్తే తప్ప దిగుబడి రాదని వాపోతున్నారు. - హాలహర్వి



మండల కేంద్రంలోని బీసీ కాలనీలోని ఆలయం వద్ద తాగునీటి ట్యాంక్ నుంచి నీరు ఓవర్‌ఫ్లో అవుతూ వృథా అవుతోంది. అలాగే కొళాయిలకు బిరడా కూడా సరిగా లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా వృథాను అరికడతామన్నారు. - హొళగుంద

నవ్వుతారు..!

- 15 రోజులకే కంకర తేలి గుంతలు పడిన బీటీ రోడ్డు
- హొళగుంద-హొన్నూరు క్యాంప్ రహదారి దుస్థితి



నాసిరకంగా వేయడంతో గుంత పడిన బీటీ రోడ్డు



కోతకు గురైన రహదారి అంచులు

హొళగుంద, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి రూ.కోట్లలో ఖర్చు చేస్తోంది. అయితే కొందరు కాంట్రాక్టర్ల వ్యవహారంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది. హొళగుంద నుంచి హొన్నూరు క్యాంప్‌కు 5.2 కిలో మీటర్ల రహదారికి రూ. 4.70 కోట్లు ఖర్చు చేసి వేసిన రోడ్డు 15 రోజులకే రాళ్లు తేలింది. కంకర రాళ్లపై చిప్స్ వేసి వాటిపై 25ఎంఎం క్వాలిటీతో తారు వేయాల్సి ఉంది. నాసిరకంగా వేయడంతో ఇప్పటికే కొంత గుంత పడగా ఆరు నెలల్లోనే రోడ్డు మొత్తం గుంతలు పడడం ఖాయమని స్థానికులు వాపోతున్నారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఏం చేస్తున్నారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పీఆర్ ఏఈ యమునప్పను వివరణ కోరగా విచారణ చేస్తామని, రహదారి నాణ్యత లేకపోతే కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పాలిటెక్నిక్ కోర్సులతో ఉద్యోగాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

ఆలూరు మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సులతో ఉద్యోగ అవకాశాలు వస్తాయని ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నపు రెడ్డి అన్నారు. మంగళవారం కళాశాల వార్షికోత్సవం సందర్భంగా జాబ్ మేళా నిర్వహించారు. సివిల్, మెకానిక్ చివరి సంవత్సర విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలో ఉద్యోగాలు లభించాయన్నారు.

సారా తయారు చేస్తే పీడీ యాక్ట్

వెల్దుర్తి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): సారా తయారు చేస్తే పీడీ యాక్టు నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ మంజుల, ఎస్ఐలు చంద్రమోహన్, లక్ష్మీదేవి హెచ్చరించారు. మంగళవారం ఎల్.తండా, రత్నపల్లి గ్రామాల్లో సారా దుష్ప్రభావాలపై కళాజాతా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమం ద్వారా సారా తయారీ మానుకునే వారికి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను కల్పిస్తోందన్నారు. గ్రామాల్లో సారాను నిర్మూలించడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎక్సైజ్ సిబ్బంది మాబుపీరా, నాగయ్య ఉన్నారు.

నైపుణ్యం ఉంటేనే ఉద్యోగాలు



మాట్లాడుతున్న బీఎస్ఎన్ఎల్ ఇంజనీర్ సంజీవ్ కుమార్

ఆదోని అగ్రికల్చర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యముంటేనే ఉద్యోగాలు లభిస్తాయని బీఎస్ఎన్ఎల్ సబ్ ఇంజనీర్ సంజీవ్ కుమార్ అన్నారు. బుధవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. వివిధ కంపెనీల ప్రతినిధులు 29 మందికి ఉద్యోగాలు ఇచ్చారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈసీఈ విభాగంలో 13 మంది, ఈఈఈ విభాగంలో 16 మందికి ఉద్యోగాలు వచ్చాయని యంగ్ ఇండియా సంస్థ రూ.3 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలను కల్పిందన్నారు. ముఖ్య అతిథి బీఎస్ఎన్ఎల్ డివిజన్ ఇంజనీర్ సంజీవ్ కుమార్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ప్లేస్మెంట్ అధికారి రామ సుబ్బారెడ్డి, డాక్టర్ కిరణ్ నాయక్, ఆదిశేషయ్య, పెద్దారెడ్డి పాల్గొన్నారు.


నేడు పత్తికొండలో ప్రజా పరిష్కార వేదిక

పత్తికొండ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజా పరిష్కార వేదిక నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే శ్యాంబాబు వినతులు స్వీకరించున్నారని ప్రజలు, బాధితులు వివరాలతో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల్లోపు రావాలని పార్టీ నాయకులు తెలిపారు.

వేలం వాయిదా

- సర్కార్ పాట తగ్గించాలని కాంట్రాక్టర్ల డిమాండ్

ఆదోని టౌన్ మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మంగళవారం ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్ వేలాలు వాయిదా పడ్డాయి. కమిషనర్ కృష్ణ ఆధ్వర్యంలో అధికారులు సర్కారు పాటను రూ.76 లక్షలుగా ప్రకటించడంతో కాంట్రాక్టర్లు అభ్యంతరం తెలిపి, కమిషనర్‌తో వాగ్వాదానికి దిగారు. కూరగాయల హోల్‌సేల్ మార్కెట్‌తో పాటు ఎండుమిరప, ఉల్లిగడ్డల మార్కెట్ కూడా అగ్రికల్చర్



కమిషనర్‌తో వాగ్వాదం చేస్తున్న కాంట్రాక్టర్లు

మార్కెట్ యార్డుకు తరలిపోవడంతో ఆదాయం రాదని పాటదారులు పేర్కొన్నారు. లారీల రుసుము కూడా వసూలు చేసే వీలుండేదని ఇప్పుడు లేకపోవడంతో తాము తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని కాంట్రాక్టర్లు వాపోయారు. సర్కారు పాట తగ్గిస్తేనే వేలాల్లో పాల్గొంటామని, లేనిపక్షంలో అధికారులే వసూలు చేసుకోవాలని కాంట్రాక్టర్లు వీరేష్, జయరాం, తిమ్మప్ప, వెంకటేష్, బుద్దరెడ్డి, లక్ష్మి నారాయణ బయటికి వెళ్లిపోయారు. దీంతో చేసేదేమీ లేక కమిషనర్ వేలాలను బుధవారానికి వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, రెవెన్యూ ఆఫీసర్ కేయండీ నాసిర్ హూస్సేన్ ఆర్ఐలు చంద్రమోహన్ పాల్గొన్నారు.

బస్టాండు సుంకం వేలం రూ.12.80 లక్షలు

వెల్దుర్తి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పంచాయతీ వేలాలు మంగళవారం డీఎల్‌పీవో లక్ష్మి ఆధ్వర్యంలో ఈవోఆర్డీ రవికిశోర్, కార్యదర్శి లక్ష్మీనాథ్ నిర్వహించారు. పాటదారుడు ఉప్పరి బాలు రూ.12.80లక్షలకు మార్కెట్ సుంకం వేలాన్ని దక్కించుకున్నారు. మిగతా వేలాలకు పాటదారులు ముందుకు రానందున 28వ తేదీకి వాయిదా వేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుంకన్న, సర్పంచ్ శైలజ, ఉప సర్పంచ్ శ్వేత, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దేవనకొండ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం ప్రమాదంలో గాయపడిన వ్యక్తి కోలుకోలేక మంగళవారం మృతిచెందాడు. వివరాల మేరకు.. కె.వెంకటాపురం గ్రామానికి చెందిన గోకారి (35) ఆదివారం బైక్‌పై కర్నూలుకు వెళ్లి రాత్రి తిరిగి వస్తుండగా కె.నాగలాపురం వద్ద కుక్క అడ్డురావడంతో, అదుపు తప్పి కిందపడ్డాడు. వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య హరిత, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



గోకారి(ఫైల్)

బకాయిలపై వడ్డీ రాయితీ

ఆదోని టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను బకాయిదారులకు ప్రభుత్వం శుభవార్త ప్రకటించిందని మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ కేఎండీ నాసిర్ హూసేన్ మంగళవారం తెలిపారు. బకాయిలపై వడ్డీలో 50 శాతం మాఫీ చేసిందన్నారు. ఈ అవకాశం నెల 31 వతేదీ వరకు మాత్రమే ఉంటుందని, బకాయిదారులు వినియోగించుకోవాలని కోరారు.

28 నుంచి బ్రహ్మోత్సవాలు

ఆస్పరి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కైరుప్పల గ్రామం భద్రకాళి వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 28నుంచి ఏప్రిల్ 5 వరకు ఉంటాయని కార్యనిర్వహణ అధికారి రాంప్రసాద్ తెలిపారు. బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ మస్తాన్ వలి చెప్పారు.

'చిచ్చు పెడితే సహించం'

ఆదోని టౌన్ మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : వాల్మీకుల మధ్య చిచ్చు పెడితే సహించమని ఆ సంఘం నాయకుడు కొండయ్య హెచ్చరించారు. మంగళవారం ఎమ్మిగనూరు వాల్మీకి నాయకులు శాంత దీక్షా శిబిరాన్ని సందర్శించి, సంఘీభావం ప్రకటించారు. నారాయణ, తాయన్న పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్

వెల్దుర్తి, మార్చి 25(ఆంధ్రజ్యోతి):స్థానిక పెద్దమసీదులో ముస్లింలకు ఎస్సై అశోక్ మంగళవారం ఇఫ్తార్ ఇచ్చారు. ముస్లింలతో కలసి నమాజ్ చేశారు. స్వయంగా ఆహారాన్ని వడ్డించారు. పోలీసులు రాముడు, సమీర్ పాల్గొన్నారు.

29న వేలం

మద్దికెర, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ బండారు సుహాసిని అధ్యక్షతన నిర్వహించిన పంచాయతీ వేలాలు వాయిదా పడ్డాయి. పాటదారులు ఎవరూ రాకపోవడంతో ఈ నెల 29వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు

హొళగుంద, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ గురజాల దిలీప్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సత్ప్రవర్తనతో మెలగాలని, నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా ఊరుకోమన్నారు. కానిస్టేబుళ్లు చంద్ర, అనిల్ పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ దిలీప్‌కుమార్

పనులు వేగంగా చేయాలి



పనులను పరిశీలిస్తున్న ఏఈ విష్ణు

మద్దికెర, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో సీసీ రహదారి పనులను వేగంగా చేయాలని పీఆర్ ఏఈ విష్ణు సూచించారు. మంగళవారం మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో పనులను ప్రారంభించారు. నాణ్యత పాటించకుంటే బిల్లులు నిలిపివేస్తామన్నారు. మరో రూ.2 కోట్ల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపామన్నారు. సచివాలయ ఏఈలు సురేష్, శిరీష, ఉన్నారు.

రంజాన్ మాసం పవిత్రం



ఆహార ప్యాకెట్లు ఇస్తున్న విజయ్ ప్రసాద్ యాదవ్

మద్దికెర, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ముస్లింలకు రంజాన్ మాసం పవిత్రమని, సుబ్రహ్మణ్య స్వామి ఆలయ నిర్వాహకుడు విజయ్ ప్రసాద్ యాదవ్ అన్నారు. మంగళవారం స్థానిక మసీదుల్లో ముస్లింలకు ఆహార ప్యాకెట్లను అందజేశారు. కులమ తాలకతీతంగా అన్నదమ్ముల్లా హిందూ ముస్లింలు కలిసి మెలిసి ఉండాలని కోరారు. సత్తార్, ఖాజావలి, మాబు కరీం, సైకిల్ షాపు బాషా, ఖలీల్ తదితరులు ఉన్నారు.

సీజనల్ హాస్టల్ తనిఖీ

హొళగుంద, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీజనల్ హాస్టల్‌ను సమగ్ర శిక్ష అసిస్టెంట్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సీఎంవో శివశంకర్, ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా కో ఆర్డినేటర్

రైతుల ఆత్మహత్యలకు ఎవరు బాధ్యులు?

చిప్పగిరి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కేడీసీసీ బ్యాంక్ అధికారులు రైతుల నుంచి బలవంతంగా రుణాలు వసూలు చేస్తున్నారని, దీనివల్ల రైతులు ఆత్మహత్యకు పాల్పడితే ఎవరు బాధ్యులని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ప్రశ్నించారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, రెండేళ్లుగా పంటలు పండక రైతులు అప్పుల్లో కూరుకుపోయారని, బ్యాంకు అధికారులు ట్రాక్టర్లు, బైకులు, టీవీలు తీసుకెళ్లడం సరికాదన్నారు. చిప్పగిరి, ఆలూరులో అన్యాయాన్ని ఆపకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

పీఈటీ ప్రతిభ

ఆదోని అగ్రికల్చర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల ఢిల్లీలో నిర్వహించిన జాతీయ సివిల్ సర్వీస్ కోకో క్రీడల్లో పెద్ద హోతూరు జడ్పీ పాఠశాల పీఈటీ చెన్నబసప్ప ప్రతిభ కనబరచినట్లు జిల్లా కోకో అసోసియేషన్ కోశాధికారి ఖలీల్ అహ్మద్ బుధవారం తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

'బెట్టింగ్ వైపు చూడకండి'

తుగ్గలి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): యువత బెట్టింగ్ వైపు చూడొద్దని పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ గౌడ్ సూచించారు. మంగళవారం మాట్లాడుతూ క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్లతో యువత భవిష్యత్‌ను కోల్పోతున్నారన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై నిఘా ఉంచాలన్నారు. ఎస్ఐలు కృష్ణమూర్తి, జయశేఖర్ ఉన్నారు.

మహిళ అదృశ్యం

ఆదోని రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ అదృశ్యమైంది. గ్రామానికి చెందిన వ్యక్తికి ఆరు సంవత్సరాల క్రితం సమీప బంధువైన కోసిగి మండలానికి చెందిన మహిళతో వివాహమైంది. ఈనెల 8న బహిర్భూమికి వెళ్లి ఇంటికి రాలేదు. భర్త ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇస్వి ఎస్సై నాగేంద్ర తెలిపారు.

సైబర్ నేరాలు, ప్రమాదాలపై అవగాహన కల్పిస్తాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- రవి శంకర్ రెడ్డి ఆలూరు సీఐ



ఆలూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని ఆలూరు సీఐ రవి శంకర్ రెడ్డి అన్నారు.

ప్రశ్న: రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ఎస్పీ అదేశాల మేరకు వాహనదారులకు కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. హెల్మెట్ వాడాలని సూచిస్తున్నాం.

ప్రశ్న: పేకాట, సారా నియంత్రణకు చర్యలు తీసుకున్నారా?

జవాబు: ఆలూరు సర్కిల్ పరిధిలోని 4 మండలాల్లో పేకాట, అక్రమ మద్యం, సారా తయారీపై నిఘా ఉంచాం. అసాంఘిక కార్యకలాపాలపై సమాచారమిచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం.

ప్రశ్న: ఆలూరులో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకున్నారా?

జవాబు: రద్దీగా ఉండే అరికెర రోడ్డు, అంబేడ్కర్ కూడళ్లలో ఇద్దరు కానిస్టేబుళ్లను నియమించాం. ట్రాఫిక్‌కు ఇబ్బంది చూస్తున్నాం.

ప్రశ్న: పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకునే ఆటో డ్రైవర్లపై చర్యలు తీసుకుంటున్నారా?

జవాబు: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ విషయంలో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

ప్రశ్న: పల్లెనిద్ర నిర్వహిస్తున్నారా?

ప్రశ్న: సమస్యాత్మక గ్రామాల్లో ఘర్షణలు, ఫ్యాక్షన్‌కు తావు లేకుండా ఉండేందుకు పల్లెనిద్ర చేస్తున్నాం. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: గ్రామాలపై నిఘ ఉంచారా?

జవాబు: సమస్యాత్మక గ్రామాల్లో నిఘా ఉంచాం. రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చి, ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేస్తున్నాం.

ప్రశ్న: ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం అమలు చేస్తున్నారా?

జవాబు: ప్రజలతో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంతో ముందుకెళ్తాం. సమస్యత వస్తే ప్రజలు ధైర్యంగా పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చు.

ఎమ్మిగనూరు

● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

రీ సర్వే త్వరగా పూర్తి చేయాలి: సబ్ కలెక్టర్



రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

నందవరం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రీ సర్వే పైలెక్ట్ ప్రాజెక్టుగా ఎన్నికైన నదికైరవాడి గ్రామంలో రీ సర్వే పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. మంగళవారం నదికైరవాడిలో తహసీల్దారు శ్రీనివాసులు ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో అధికారులతో సంబంధిత అంశాలపై సచివాలయంలో చర్చించారు. రీ సర్వే ప్రక్రియను తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. అనంతరం గ్రామస్థులతో కూడా మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాసరాజు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దారు మహేష్, మండల సర్వేయర్ అక్బర్‌బాషా, సర్వేయర్ ముగతి శేఖర్ పాల్గొన్నారు.

పక్కాగా నిర్ధారించుకోవాలి

మంత్రాలయం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): సర్వే నంబరులోని రైతులందరూ ఒకసారి వచ్చి తమ పొలం సరిహద్దులు, కొలతలను పక్కాగా నిర్ధారించుకోవాలని సర్వే డిప్యూటీ తహసీల్దారు సరస్వతి సూచించారు. మంగళవారం చెట్నహళ్లి గ్రామంలో మండల సర్వేయర్ అశోక్, గ్రామ సర్వేయర్ నవీన్ కుమార్, వీఆర్వో భీముడు ఆధ్వర్యంలో రీసర్వేలో భాగంగా భూముల కొలతల నిర్ధారించారు. అనంతరం గ్రామ సచివాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ కొంత మంది రైతుల సరిహద్దులలో తేడా ఉండ వచ్చని, క్షేత్రస్థాయిలో సరి చేస్తున్నట్లు తెలిపారు. భూముల తేడాల్లో రైతులు అనుకూలంగా ఒకరికొకరు సర్దుకుని వెళితే సులువుగా పరిష్కారం అవుతుందన్నారు. అభ్యంతరం లేని భూములను ఎల్‌పీఎంలు తయారు చేసేందుకు రైతుల నుంచి నిర్ధారణ పత్రాన్ని తీసుకున్నారు. సమావేశంలో సర్వేయర్లు తిమ్మేష్, ధరణి, ఉరుకుందాచారి, శోభా, భీరప్ప, హరిత, రాధారాణి, భవిత, శేఖర్ నాయక్, చిట్టిరెడ్డి, అనూష, నాగమణి, వీఆర్‌ఏలు భీమయ్య పాల్గొన్నారు.

28న గోనెగండ్ల పంచాయతీ మార్కెట్ వేలం

గోనెగండ్ల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీలోని సంతమార్కెట్, కబేళా, బండిమెట్ట వేలం ఈనెల 28న నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి సతీష్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 10గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు పంచాయతీకి రూ. 15 వేలు డిపాజిట్ చేయాలన్నారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మలాంగ్, సుభాన్, అనిల్ సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు విరాళాలు

కౌతాళం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లూరు గ్రామంలో లింగాయత్‌ల విశ్వగురువు బసవేశ్వర నూతన విగ్రహ ప్రతిష్ఠాపనకు మంగళవారం టీడీపీ మండల నాయకులు విరాళాలు అందజేసినట్లు గ్రామ పెద్ద, టీడీపీ రైతు విభాగపు రాష్ట్ర కార్యదర్శి అడివప్పగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ గ్రామంలో బసవేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు దాతల నుంచి విరాళాలు సేకరిస్తున్నామన్నారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, రైతు విభాగపు జిల్లా కార్యదర్శి వెంకటపతిరాజు ఎల్ఎల్‌సీ తుంగభద్ర ప్రాజెక్టు ఛైర్మన్ టిప్పుసుల్తాన్ రూ.33 వేలు అందించినట్లు తెలిపారు. వీరిని సన్మానించారు.

రేపు జాబ్ మేళా

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 27న జాబ్ మేళా నిర్వహించనునట్లు జిల్లా అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పా రు. పదో తరగతి నుంచి ఏదైనా డిగ్రీ, పీజీ చదివి,18-35 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు అర్హులన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు విద్యార్హత పత్రాలు జిరాక్స్ ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో హాజరుకావాలని సూచించారు.

పుట్టగొడుగుల్లా వాటర్ ప్లాంట్లు

- అనుమతులు తీసుకోకుండా ఏర్పాటు
- కొరవడిన మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ
- శుద్ధజలమంటూ సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో వాటర్ ప్లాంటులు పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నాయి. ఒకప్పుడు పట్టణానికి అంతా కలిపి ఒకటి రెండు ప్లాంట్లు ఉండేవి. కానీ నేడు స్వచ్ఛమైన వాటర్ పేరుతో పదుల సంఖ్యలో ప్లాంట్లు వెలిశాయి. కానీ ఏ ఒక్క వాటర్‌ప్లాంట్ నిర్వాహకుడు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. బోరులో సమృద్ధిగా నీరు ఉంటే మరుసటి రోజు ఆ ప్రాంతంలో ఒక వాటర్ ప్లాంట్లు వెలుస్తుంది. సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే వాటర్ ప్లాంట్లు వీధి కొక్కటి వెలుస్తున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి వాటర్ ప్లాంటు ఏర్పాటుకు మునిసిపల్, విద్యుత్‌శాఖ అధికారుల అనుమతులు పొందాలి. అలాగే బోరు, గ్రౌండ్ వాటర్ టెస్టింగ్, ల్యాబ్‌తో పాటు వివిధరకాల అనుమతులు పొందాల్సి ఉంటుంది.



వాటర్ ప్లాంట్‌లో నీటితో నిల్వ చేసిన ట్యాంక్‌లు, బాటిళ్లు

అయితే ఇవన్నీ అనుమతులు లేకుండానే వాటర్ ప్లాంటులు ఏర్పాటు అవుతున్నాయి. ఎమ్మిగనూరు పట్టణంలో ఇలా దాదాపు 30కిపైగా ప్లాంట్లు వెలిశాయి. వ్యాపారులు ప్యూరిఫైడ్ వాటర్ పేరుతో రూ. లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. నీటి శుద్ధి కోసం ల్యాబ్ పరీక్షలు గాలికొదిలారు. ఈ విషయంపై డిస్ట్రిక్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్‌ను వివరణ కోరగా బ్యూరో ఆఫ్ ఇండియా స్టాండర్డ్ అనుమతులు పొందాలి. పట్టణంలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

మూగజీవాలకు మేతగా కొత్తిమీర

గోనెగండ్ల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఎండలకు కొత్తిమీర సాగు చేసిన రైతులు విలవిలాడుతున్నారు. దీనికి తోడు ముదురుతుండటంతో కొత్తి మీర కొనేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని సాగు చేసిన రైతులు లబోదిబోమంటున్నారు. కొత్తి మీర పంటకు ప్రతి రోజు లేక పోతే రోజు విడిచి రోజు నీరు కట్టాల్సి ఉంది. ఊహించని విధంగా బావులు, బోర్లలో నీరు అడుగంటి పోవడం, బోర్లలో పట్టిపట్టి నీరు వస్తుండటంతో సాగు చేసిన పంటకు నీరు సరిపోవడం లేదు. దీంతో కొత్తి మీర రైతుల కష్టాలు అన్ని ఇన్ని కావు. పంట ఎండిపోతుండటంతో మూగజీవాలకు మేతగా వదులుతున్నారు. మండల వ్యాప్తంగా దాదాపు 200 ఎకరాల్లో కొత్తిమీరను సాగు చేశారు. కబుల్ అనే రైతు ఒక ఎకరంలో కొత్తిమీరకు రూ. 70వేలు పెట్టుబడి పెట్టి పంటను సాగు చేశాడు. పంట ఎండిపోవడంతో ధర పలకడం లేదు. దీనికి తోడు పంట సాగు చేసి 40 రోజులు ముగియడంతో ఇక చేసేది లేక మూగజీవాలకు వదిలివేస్తున్నారు. కొత్తి మీర రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఎండిన కొత్తి మీరను మేస్తున్న మూగజీవాలు

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి: సీఐటీయూ



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ప్రతి కార్మికుడు ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో సీఐటీయూ అధ్యక్షులు గోవిందు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను నేడు బీజేపీ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించి నాలుగు లేబర్ కోడ్‌లుగా చేసిందన్నారు. కనీస వేతన హక్కు చట్టం, గ్రాట్యుటీ, పెన్షన్, పనిభద్రత, సెలవులు ఇతర సౌకర్యాలు లేకుండా చట్టాల వల్ల కార్మికుల హక్కులు పూర్తిగా హరించివేసిందన్నారు. తక్షణమే కార్మికులకు, ఉద్యోగులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లు రద్దయ్యే వరకు ఉద్యమించాలని సీఐటీయూ నాయకులు కోరారు. కార్యక్రమంలో రాముడు, ప్రవీణ్ కుమార్, రాజు, వరలక్ష్మి, విజయమ్మ, గోవర్ధనమ్మ పాల్గొన్నారు.

ఇఫ్తార్‌ను బహిష్కరిస్తాం : ఎస్‌డీపీఐ

ఎమ్మిగనూరు, మార్చి25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఇఫ్తార్‌ను బహిష్కరిస్తామని ఎస్‌డీపీఐ పట్టణ అధ్యక్షుడు హుసేన్ బాషా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వక్ఫ్‌బోర్డు బిల్లుతో పాటు బీజేపీ నాయకులు 14 సవరణలను ఆమోదింపజేసుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వం రూ.1.50కోట్ల ప్రజాధనాన్ని కేవలం ఓటు రాజకీయం చేయాలని చూస్తున్నారే తప్ప మరొకటి కాదన్నారు. టీడీపీ ఎన్నికల్లో ముస్లింలకు అండగా ఉంటామని ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. లేని పక్షంలో రాబోవు ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెబుతామన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ఎమ్మిగనూరు, మార్చి25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పురపాలక సంఘం సాధారణ సమావేశాన్ని బుధవారం ఛైర్మన్ డాక్టర్ రఘు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు కమిషనర్ గంగిరెడ్డి మంగళవారం ఓప్రకటనలో తెలిపారు. సమావేశానికి మున్సిపల్ కౌన్సిలర్లు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని కమిషనర్ కోరారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



గంజహళ్లి చెరువు దగ్గర నీటిని పరిశీలిస్తున్న ఏఈ

గోనెగండ్ల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వేసవిలో గోనెగండ్ల మండలంలోని 20 గ్రామ పంచాయతీలలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలలో ఉన్న నీటి కుంటలను, చెరువులను ఎల్లెల్సీ నీటితో నింపుతున్నామని, దీంతో ఈ వేసవి కాలంలో గ్రామాలలో నీటి ఎద్దడి రాకుండా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎల్లెల్సీ కాలువ నుంచి గోనెగండ్ల, అలువాల సమ్మర్ స్టోరేజి ట్యాంక్‌లను నీటితో నింపివేశామని, అలాగే కులుమాల చెరువు, ఎర్రబాడులో రెండు చెరువులను, ఒంటెడుదిన్నె చెరువును, గోనెగండ్ల తూమ్మకుంట చెరువును నీటితో నింపివేశామన్నారు. అలాగే చిన్నమరివీడు చెరువును బుధవారం నింపనున్నట్లు ఆయన తెలిపారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

మంత్రాలయం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం కెనరా బ్యాంకు రైతులకు, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తోందని మేనేజర్ అల్లగడ్డ నాగార్జున అన్నారు. మంగళవారం మంత్రాలయానికి చెందిన దోమ నరసింహులు మృతి చెందడంతో అతడి భార్య దోమ సంధ్యకు పీఎంజేజేబీవై పాలసీ కింద రూ.2 లక్షలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు మనోహర్, లక్ష్మిరెడ్డి, ఉరుకుందు, క్యాషియర్ పుష్పలత, రవి, సూరి, మురళి పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ఆర్డీటీ లక్ష్యం

మంత్రాలయం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల పేదల అభ్యున్నతే ఆర్‌డీటీ లక్ష్యమని స్పెయిన్ దేశస్తులు అంథోని, విలియమ్స్ అన్నారు. మంగళవారం మండలంలోని సూగూరు గ్రామంలో ఆర్‌డీటీ కింద కమ్యూనిటీ హాలు నిర్మించిన దాతలు అంథోని, విలియమ్స్‌లు గ్రామానికి రావడంతో ఆర్డీటీ టీమ్ ఏరియా లీడర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో గ్రామస్థులు పూలమాలలు వేసి ఊరేగించారు. అనంతరం వారు మాట్లాడుతూ 1 నుంచి 5వ తరగతి వరకు చదివే పిల్లలకు కమ్యూనిటీ హాలులో ట్యూషన్ ఏర్పాటు చేసుకోవడం వల్ల విద్యార్థులు విజ్ఞానం పొందుతారన్నారు. పేదరికం శాశ్వతంగా దూరం కావాలంటే తమ పిల్లలను బాగా చదివించాలని, వలసలు వెళ్లకుండా పిల్లలను బడులకు పంపాలని సూచించారు. ఆర్‌డీటీ ద్వారా అందుతున్న సంక్షేమ ఫలాలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకుని జీవన నైపుణ్యాలు పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డీటీ సీఈవో నరసింహులు, వీరస్వామి, హనుమన్న, గర్జి గోపినాథ్, ఏసేబు, సుజ్ఞానం, ఆనందు, గాబ్రియేలు, రాజు, తదితరులు పాల్గొన్నారు.



పేద విద్యార్థులతో స్పెయిన్ దేశస్థులు

ఆలిండియా సివిల్ సర్వీసు ఖోఖో పోటీల్లో ప్రతిభ



కాంస్య పతకంతో చెన్నబసప్ప

కోసిగి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంపాపురం గ్రామానికి చెందిన పెద్దహోతూరు జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు చెన్నబసప్పకు ఆలిండియా సివిల్ సర్వీసు ఖో-ఖో పోటీలో కాంస్య పతకం సాధించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను క్రీడల్లో ప్రోత్సహించే ఉద్దేశంతో ఇటీవల విజయవాడలో ఉద్యోగులకు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన సివిల్ సర్వీసెస్ ఖో-ఖో పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ నెల 21 నుంచి 24 వరకు ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి సివిల్ సర్వీసు ఖో-ఖోలో ఆంధ్రప్రదేశ్ ఖో-ఖో జట్టు తరుపున ప్రాతినిధ్యం వహించి ఆర్‌ఎస్‌బీ బెంగుళూరు, రాజస్థాన్, తెలంగాణ, కర్ణాటక మహారాష్ట్ర వంటి జట్లపై విజయం సాధించి కాంస్య పతకాన్ని సాధించాడు. చెన్నబసప్పకు కర్నూలు జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఛైర్మన్ పుల్యాల నాగిరెడ్డి, అధ్యక్షుడు శంకర్, కార్యదర్శి ప్రభాకర్, కోశాధికారి ఖలీల్ అహ్మద్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

పిల్లల వివరాలు నమోదు చేయాలి

నందవరం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పుట్టిన పిల్లల వివరాలు యాప్‌లో నమోదు చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ రేవతి సూచించారు. మంగళవారం నందవరం పీహెచ్‌సీలో ఆశ, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ వర్కర్లకు నిర్వహించిన శిక్షణ తరగతులను డాక్టర్ రోశన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ గర్భవతుల మొదటి రిజిస్ట్రేషన్, చైల్డ్ రిజిస్ట్రేషన్, టీకాల కార్యక్రమం గురించి యూ-డబ్ల్యూఐఎన్ యాప్‌లో నమోదు గురించి వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్, శ్రీనివాసులు, మరియమ్మ, సుశీల సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయకు విద్యార్థి ఎంపిక

కోసిగి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నభోంపల్లి గ్రామానికి చెందిన సీబీ నీలకంఠ, నాగవేణి దంపతుల కుమారుడు సీబీ కార్తీక్ నవోదయ ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచారు. సీబీ కార్తిక్‌ను తల్లిదండ్రులు, చిన్నభూంపల్లి గ్రామస్థులు అభినందించారు. అక్షరాస్యతో వెనకబడిన మండలం నుంచి నవోదయ పాఠశాలలో సీటు సాధించడంతో కోసిగి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

'జీతాల్లో కోత విధించడం అన్యాయం'

గోనెగండ్ల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మేజర్ పంచాయతీలో పారిశుధ్య కార్మికుల వేతనాలలో కోత విధించడం అన్యాయమని సీఐటీయూ జిల్లా నాయకుడు ఆనంద్‌బాబు, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ అన్నారు. మంగళవారం గోనెగండ్ల పారిశుధ్య కార్మికులతో కలసి నిరసన తెలిపారు. అనంతరం పంచాయతీ సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్‌లకు వినతి పత్రం అందజేశారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



అధికారులకు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

మంత్రాలయం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించి ప్రజల దాహార్తిని తీర్చాలని సీపీఎం మండల కార్యదర్శి జయరాజు, బీఎస్ఎస్ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవపుత్ర డిమాండ్ చేశారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిలకలడోన గ్రామంలో దాదాపు 18 నెలల నుంచి తాగునీటి కోసం ఇబ్బందులు పడుతు న్నామని వాపోయారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అనిల్, ప్రాణేష్, లక్ష్మన్నలు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా పట్టణాభివృద్ధి: టీడీపీ



పైపులైన్ పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

ఎమ్మిగనూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా ఎమ్మిగనూరు పట్టణాభివృద్ధి జరుగతోందని టీడీపీ నాయకులు తురేగల్ నజీర్ అన్నారు. పట్టణంలోని కలుగొట్ల రోడ్డులోని రెండో వార్డులో జరుగుతున్న పైపలన్, డ్రైనేజీ, రహదారి పనులను వార్డు టీడీపీ నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంకు డైరెక్టర్ వాల్మీకి రాజు, కార్యకర్తలు సరోజమ్మ, భూతరమేష్, రాజేశ్వరి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యాన్ని అరికట్టాలి: ఏఐఎస్ఎఫ్



మాట్లాడుతున్న వీరేష్

కోసిగి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలో కర్ణాటక మద్యం ఏరులై పారుతోందని, విద్యార్థులు సైతం బానిస అవుతున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వీరేష్ అన్నారు. మంగళవారం కోసిగిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండలంలో పాఠశాలల సమీపంలోనే బెల్టు షాపులు ఏర్పాటు చేసి యథేచ్ఛగా మద్యం అమ్మకాలు జరుపుతున్నా పోలీసు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. మద్యం దుకాణాల్లో విద్యార్థులకు సైతం మద్యాన్ని విక్రయిస్తున్నారని ఆరోపించారు. పోలీసు అధికారులు స్పందించి ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలని వీరేష్ కోరారు. మండల కార్యదర్శి అంజి, హనుమంతు, నరసింహులు, అశోక్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి


పెద్దకడబూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. ఈ ఘటన పెద్దకడుబూరులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు వెంకటేష్‌కు చెందిన ఎద్దులను పొలం దగ్గర మేతకు వదిలాడు. పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని రైతు తెలిపారు.

భూ సమస్యలు పరిష్కరించుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దారు గీతా ప్రియదర్శిని

పెద్దకడబూరు , మార్చి 25(ఆంధ్రజ్యోతి): రైతులు రీ సర్వేలో భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దారు గీతా ప్రియదర్శిని అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నౌలేకల్ గ్రామంలోని సచివాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గట్టు సమస్యలుంటే ఇరువురు సమక్షంలోనే పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, సర్వేయర్లు పాల్గొన్నారు.



ఆస్తి పన్ను బకాయి చెల్లింపుపై వడ్డీ రాయితీ

ఎమ్మిగనూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను, ఖాళీస్థలాల పన్నుల బకాయిలను మార్చి 31లోపు ఒకే సారి ఏకమొత్తంలో చెల్లించినట్లైతే పన్ను చెల్లింపుదారులకు 50 శాతం వడ్డీ రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పురపాలక సంఘం పరిధిలోని ఇంటి, ఖాళీస్థలాలపై మొదటి అర్ధసంవత్సరం, రెండో అర్ధసంవత్సరం డిసెంబరు నెలాఖరులోపు పన్నులు చెల్లించని పక్షంలో 2శాతం వడ్డీతో కలిపి చెల్లించాల్సి ఉంటుందన్నారు. అయితే పన్ను చెల్లింపు దారుల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు, పురపాలక సంఘం పరిధిలో పేరుకుపోయిన పన్ను బకాయిలు వసూలు కోసం ఈనెల 31లోపు పన్నులు చెల్లించిన వారికి ప్రభుత్వం వడ్డీలో 50 శాతం రాయితీ కల్పించినట్లు తెలిపారు. అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

గుర్తింపు కార్డులు జారీ చేయాలి

కోసిగి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులను జారీ చేయాలని రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఎం.గోపాల్ కోరారు. మంగళవారం కోసిగి రెండో సచివా లయం ఉద్యోగులకు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కౌలు రైతులకు కౌలు రైతుమిత్ర గ్రూపులు ఏర్పాటు చేసి ష్యూరిటీ లేకుండా పంట రుణాలు అందించాలని, ఈక్రాఫ్ నమోదు చేసి పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు తాయన్న, డీహెచ్‌పీఎస్ మండల నాయకులు ఓంకార్ స్వామి, ఏఐటీయూసీ నాయకులు పరుశురాములు పాల్గొన్నారు.

భక్తులకు నిజ బృందావన దర్శనం

మంత్రాలయం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో మంగళవారం జరగాల్సిన నిత్యపూ జలకు విరామం ఇచ్చారు. మంగళవా రం ఏకాదశి సందర్భంగా బృందావనానికి నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, టెంకాయకొట్టడం, పరిమళ ప్రసాదం బంద్ చేశారు. పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించి, మహామంగళహరతులు ఇచ్చారు. అలంకరణ లేని రాఘవేంద్రస్వామి నిజ బృందావనాన్ని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.